జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 05 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 151 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: సప్తమి - 20:44:31 వరకు నక్షత్రంఅశ్విని - 21:18:51 వరకు కరణంవిష్టి - 09:28:45 వరకు, బవ - 20:44:31 వరకు పక్షంకృష్ణ యోగంశూల - 17:28:30 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ఇ20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

### రాజ్యసభలో కేంద్రమంత్రి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఇ20 పెట్రోల్ పాలసీ అమలుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 ఇంధన వినియోగం, పాత వాహనాల భద్రత, దీని వల్ల చేకూరే

మిగతా 2లో..

## మరో బాదుడుకు సిద్ధం అవుతున్న ట్రంప్

### హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు

వాషింగ్టన్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై

మిగతా 2లో..

# జమ్మూకశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్



## పలుచోట్ల వరుణుడి బీభత్సం..

## మెరుపు వరదల్లో 31 మంది మృతి

## ఘటనలో భారీగా ఆస్తి, ప్రాణనష్టం

న్యూఢిల్లీ,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో ప్రకృతి భీభత్సం సృష్టిస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో ఏకంగా 35 క్లౌడ్‌బరస్ట్ సంఘటనలు చోటుచేసుకున్నాయి. క్లౌడ్‌బరస్ట్ కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు , కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో సుమారు 31 మంది ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయి. చల్లదనానికి పేరుగాంచిన జమ్ముకశ్మీర్‌పై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, తరచూ చోటుచేసుకుంటున్న క్లౌడ్ బరస్ట్ ఘటనలు, మెరుపు వరదలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జమ్ము డివిజన్: పూంచ్, రాజౌరి, కరువా, దోడా, కిష్త్వార్ జిల్లాల్లో భారీ ప్రాణనష్టం సంభవించింది షోపియాన్, అనంతనాగ్, బందిపోర, కుప్వారా ప్రాంతాల్లో వరద తాకిడి తీవ్రంగా ఉంది. సోమవారం కురిసిన భారీ వర్షాలకు కుప్వారా, షోపియాన్ తదితర ప్రాంతాల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నివాస గృహాలు, దుకాణాలు, పాఠశాలలు, వంతెనలు, రోడ్లు, సాగునీటి

మిగతా 2 లో..

## డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు సీరియస్

### నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌బీఐకి ఆదేశం



న్యూఢిల్లీ,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయలు దోచుకుంటున్న నేపథ్యంలో, ఇటువంటి నేరాలను అరికట్టేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సైబర్ మోసాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్న "మ్యూల్ బ్యాంకు

మిగతా 2 లో..



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. ముందుగా తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు.

# ప్రతీ ఇంటికి ఇంటర్నెట్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతానికి కృషి
- సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ ఆఫీసుల్లో ప్రారంభం
- టీ-ఫైబర్ నెట్‌వర్క్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- టీ-ఫైబర్ పనితీరుపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష
- ఇంటింటికి ఇంటర్నెట్ ఇచ్చేందుకు అడుగులు



హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సచివాలయంలో టీ-ఫైబర్ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సెప్టెంబర్ 1 నుంచి కేవలం టీ-ఫైబర్ నెట్‌వర్క్ ద్వారానే ఇంటర్నెట్ సేవలను వినియోగించేలా చర్యలు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ప్రతి కార్యాలయానికి కనెక్టివిటీ కల్పించాలని అధికారులకు ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలకు సెప్టెంబర్ 1 తర్వాత ఎలాంటి బిల్లులు చెల్లించవద్దని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నెట్‌వర్క్ వినియోగాన్ని పెంచి ఖర్చులను తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు ఉపయోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం

మిగతా 2 లో..



# వైద్యానికి పెద్దపీట

## తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్

### వరంగల్‌లో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

### ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి హాస్పిటల్

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలను అందించే విధంగా వరంగల్ రీజనల్ కేన్సర్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష చేశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ వాణి,

మిగతా 2 లో..

## అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా?

### డీసీపీ ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు?

### రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా

### మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు

మిగతా 12 లో..

### తెలంగాణలో వర్షాలు పడకుండా

# క్షుద్రపూజలు

### హరీష్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు

### హేశ్‌కుమార్ గౌడ్‌కు హరీశ్‌రావు లీగల్ నోటీసులు



హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని..

మిగతా 12 లో..

## నగరంలో పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

- 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం
- 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు
- కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ -ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్

మిగతా 12 లో..





## తెలంగాణ వ్యాప్తంగా చురకుగా నైరుతి కదలికలు

### ఎల్లో హెచ్చరిక జారీచేసిన వాతావరణశాఖ

### పూర్తి స్థాయిలో నిండుకుండలా పోచారం ప్రాజెక్ట్

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురసే అవకాశముందని వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి వర్షాలు

మిగతా 2 లో..

# సంపాదకీయం

## బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధికారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సిన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగినప్పుడే బిజెపి మనుగడ కొనసాగుతుంది.

# ప్రతీ ఇంటికి ఇంటర్నెట్



మొదటిపేజీ తరువాయి..

చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో ఒకే నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాంతానికి కూడా ప్రారంభ దశ నుంచే పూర్తి స్థాయి టీ-ఫైబర్ ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “ఇంటింటికి ఇంటర్నెట్” కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గిస్తూ ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందేలా టీ-ఫైబర్ విస్తరణను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

మొదటిపేజీ తరువాయి..

కాలువలు కొట్టుకుపోయాయి. వందలాది ఎకరాల వ్యవసాయ భూములు నీట మునిగాయి. సహాయక చర్యలు ముమ్మరం చేసిన అధికారులు.. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆగస్టు 4, 5 తేదీల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పర్వత ప్రాంతాల్లో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదుల పరీవాహక ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు కోరారు. సోమవారం బందిపొర ప్రాంతంలో జరిగిన క్లౌడ్ బరస్ట్ వల్ల ప్రాణనష్టం తప్పినప్పటికీ, భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. పలు ఇళ్లు, పొలాలు, పశువుల కొట్టాలు నీటిపాలయ్యాయి.



## కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

### గోదావరి జలాలు ఎదురెక్కడంపై కేటీఆర్ హర్షం

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా, ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న తెలంగాణ రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు.

# వైద్యానికి పెద్దపీట



మొదటిపేజీ తరువాయి..

పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఆయా జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. తమ నియోజకవర్గాల్లోని హాస్పిటళ్లలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్ల బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ఎమ్మెల్యేల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని, వారు పేర్కొన్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో ప్రస్తుతం 29 స్పెషాలిటీల్లో వైద్య సేవలు అందిస్తుండగా, మరో 9 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందించే హబ్‌గా వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఎల్‌వోసీలు (రాజులు) మంజూరు చేస్తామని, అత్యాధునిక పరికరాలు, అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బందితో పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జనగామ, నర్సంపేట జనరల్ హాస్పిటళ్లు, మెడికల్ కాలేజీలను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. హన్మకొండలో ఐవీఎఫ్ సెంటర్‌తో పాటు డ్రగ్ అండ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. రీజనల్ ఐ హాస్పిటల్‌లో అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఎంజీఎం హాస్పిటల్‌కు అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమిస్తామని ప్రకటించారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు ఇప్పటికే డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశామని, అవసరమైన మౌలిక వసతులు పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని ఎమ్మెల్యేలు చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల అవసరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రభుత్వ హాస్పిటళ్లను అన్ని విధాలుగా బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ వ్యాప్తంగా చురకుగా నైరుతి కదలికలు

మొదటిపేజీ తరువాయి..

కురుస్తాయని పేర్కొంది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో నిన్న ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీ మీటర్లు, వికారాబాద్, సంగారెడ్డిలో భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నాగిరెడ్డి పేట మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుని పొంగిపొర్లుతోంది. సోమవారం సాయంత్రానికి 1.575 టీఎంసీ ఉ ఒడినది. సోమవారం సాయంత్రం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో ప్రాజెక్టులోకి వరద పెద్ద ఎత్తున ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుండి పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుకొని పొంగిపొర్లడం ప్రారంభించింది. ప్రాజెక్టు కెపాసిటీ 1.820 టీఎంసీ ఉండగా మంగళవారం ఉదయం నాటికి పూర్తి స్థాయిలో నిండుతోంది. ఎక్కువ ప్రాంతాల నుండి 8292 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ప్రాజెక్టు భారీగా పొంగిపొర్లుతోంది. నాగిరెడ్డిపేట్ మండలానికి పెద్దది క్కుగా ఉన్న పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుకోవడంతో నాగిరెడ్డిపేట్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక వానాకాలం పంటకు ఎలాంటి ఢోకాలేదని పేర్కొంటున్నారు.



# మత్స్యకారులకు ఇన్సూరెన్స్

## సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ ÷-లకెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



## ఇ20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

మొదటిపేజీ తరువాయి..

ప్రయోజనాలను కేంద్రం సమగ్రంగా వివరించింది. దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ పాలసీ ద్వారా ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దీని




ప్రధాన లక్ష్యమని చెప్పింది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతుందని వెల్లడించింది. ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంది.

## మరో బాదుడుకు సిద్ధం అవుతున్న ట్రంప్

మొదటిపేజీ తరువాయి..

అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది. ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబంధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదారులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్




కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్స్ విషయంలోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమతుల్లో అధిక శాతం రెన్యువల్స్‌కు సంబంధించినవే. 2025 సెప్టెంబర్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 4.06 లక్షల హెచ్-1బీ అప్లికేషన్లను ఆమోదించగా వాటిల్లో 71 శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవేనని తేలింది. కాబట్టి ఈ ఫీజు కూడా అమల్లోకి వస్తే భారతీయులపై మరింత భారం పెరిగే అవకాశం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు సీరియస్

మొదటిపేజీ తరువాయి..

ఖాతాల”పై ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) రూపొందించి దేశంలోని అన్ని బ్యాంకులకు అందుబాటులోకి తీసుకురావాలని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. “నకిలీ పత్రాలతో డిజిటల్ అరెస్టుల బాధితులు” అనే స్వప్రేరిత (సుమో మోటో) కేసు విచారణ సందర్భంగా ఈ కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. సైబర్ నేరాల్లో నేరుగా నిందితుల పేర్లతో కాకుండా, ఇతరుల బ్యాంకు ఖాతాలను డబ్బు బదిలీల కోసం వినియోగించే విధానాన్ని “మ్యూల్ అకౌంట్స్”గా పిలుస్తారు. ఇటువంటి ఖాతాల వల్ల నేరస్థులను గుర్తించడం, బాధితుల డబ్బును తిరిగి రికవరీ చేయడం కష్టతరమవుతోందని సుప్రీంకోర్టు పేర్కొంది. అందుకే ఈ ఖాతాల గుర్తింపు, నిలిపివేత, విచారణ, బాధితుల డబ్బు రక్షణ వంటి అంశాలపై స్పష్టమైన ఎస్‌ఓపీ అవసరమని ఆర్‌బీఐకి సూచించింది. ఈ ఎస్‌ఓపీ ప్రతులను దేశంలోని అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లకు కూడా అందించాలని ధర్మాసనం ఆదేశించింది. తద్వారా రాష్ట్రాల న్యాయవ్యవస్థకు ఒకే విధమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. డిజిటల్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు రూపొందించిన గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మాడ్యూల్ (ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ), మనీ రెస్టొరేషన్ మాడ్యూల్ (నగదు పునరుద్ధరణ వ్యవస్థ)లను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, చట్ట అమలు సంస్థలు అత్యవసరంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ వ్యవస్థలు పూర్తిస్థాయిలో పనిచేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రజలకు ఈ వ్యవస్థల గురించి సరైన అవగాహన కల్పించడం కూడా ప్రభుత్వాల బాధ్యతేనని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలన యంత్రాంగం విస్తృత స్థాయిలో ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించింది. డిజిటల్ మోసానికి గురైనప్పుడు ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ఎలా స్పందించాలి, డబ్బు తిరిగి పొందేందుకు ఏ విధానాలు అందుబాటులో ఉన్నాయనే విషయాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించింది. అలాగే అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లు తమ పరిధిలోని కోర్టులకు ఈ ఫిర్యాదు పరిష్కార, నగదు పునరుద్ధరణ వ్యవస్థల గురించి సమాచారం అందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తద్వారా కోర్టులను ఆశ్రయించే బాధితులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన, సాంకేతిక పరిష్కారాలపై అవగాహన కల్పించవచ్చని పేర్కొంది. సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులపై బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఉండాలని కూడా ధర్మాసనం సూచించింది. రాష్ట్రాల వారీగా, బ్యాంకుల వారీగా ఎన్ని ఫిర్యాదులు నమోదయ్యాయి, వాటిలో ఎన్ని పరిష్కరించబడ్డాయి అనే వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. దీంతో ఏ రాష్ట్రంలో, ఏ బ్యాంకులో స్పందన ఎలా ఉందో స్పష్టంగా అంచనా వేయవచ్చని తెలిపింది. సైబర్ మోసాల దర్యాప్తులో భాగంగా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే (ఫ్రీజ్ చేసే) కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి వ్యవహారాలను వేగంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

**CHANGE OF NAME**

I, K. Shankar, Service No. JC-679438-M NB/Sub, residing at H.No. 10-189/10/1, Adarshnagar, Mavala, Adilabad, Telangana – 504001, have changed the name of my son from "D SHANMUKHA" to "DURGAM SHANMUKHA". Henceforth, he shall be known as "DURGAM SHANMUKHA" for all purposes.

Date: 04-08-2026

Place: Adilabad

Sd/-

K. Shankar

## చోరీకి గురైన 112 సెల్ ఫోన్ల రికవరీ

**సీఇఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు**
**జిల్లా వ్యాప్తంగా 2377 మొబైల్ ఫోన్ల రికవరీ**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగష్టు 4, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సీఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్) పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేయడంలో నిర్మల్ జిల్లా పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా రికవరీ చేసిన సుమారు రూ.12 లక్షల 88 వేల విలువైన 112 సెల్ ఫోన్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బాధితులకు అందజేశారు.

సీఇఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ జిల్లా పరిధిలో ఇప్పటివరకు మొత్తం 2377 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు ప్రస్తుత జీవన విధానంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైన పరికరంగా మారిందని, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

బాధితులు స్వయంగా సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని, లేదా మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలతో సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సీఇఐఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు సాంకేతిక ఆధారాలతో గుర్తించి రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, బస్సులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రజలు తమ మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ సమయంలో మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు బిల్లు, ఐ ఎమ్ ఇ ఆర్ నంబర్, ఫోన్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ లేకుండా లేదా అనుమానాస్పదంగా విక్రయిస్తున్న మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు.

పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు సీఇఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. మొబైల్ ఫోన్ల రికవరీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతి పోర్టల్‌పై జూనియర్ అసిస్టెంట్లకు పూర్తి అవగాహన ఉండాలి

**– జిల్లా కలెక్టర్ కె.హరిత**
**– మండల జూనియర్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ**





**ఆసిఫాబాద్ ఆగష్టు 4 ప్రజా జ్యోతి :** జూనియర్ అసిస్టెంట్లు భూభారతి పోర్టల్‌లోని ప్రతి అంశంపైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల జూనియర్ అసిస్టెంట్లకు భూభారతి పోర్టల్ పనితీరుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి కలెక్టర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూనియర్ అసిస్టెంట్లు కేవలం తహసీల్దార్ కార్యాలయాల్లోని ధరణి సేవలకు మాత్రమే పరిమితం కాకుండా, భూభారతి పోర్టల్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. కంప్యూటర్ ఆపరేటర్లపై ఆధారపడకుండా, కార్యాలయ సాధారణ పనులతో పాటు భూభారతి పోర్టల్ లావాదేవీలను సొంతంగా నిర్వహించగలగాలని ఆదేశించారు. భూసేకరణ, వివిధ రకాల దరఖాస్తుల పరిష్కారం వంటి ఏ బాధ్యత అప్పగించినా సమర్థంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. శిక్షణ సమయంలోనే సందేహాలను నివృత్తి చేసుకుని, విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భూభారతి కోఆర్డినేటర్లు రాము, రవికాంత్, జిలానిలతో పాటు వివిధ మండలాల జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## దేశం ప్రస్తుతం కీలక పరిస్థితులను ఎదుర్కొంటోంది

**– గత పదేళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది**
**– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్**
**– బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగష్టు 6 నుంచి పాదయాత్రలు – సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ**



**మంచిర్యాల, 4,ఆగష్టు (ప్రజాజ్యోతి) :** దేశం ప్రస్తుతం కీలక పరిస్థితులను ఎదుర్కొంటోందని, గత పదేళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ విమర్శించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగష్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చలో ఢిల్లీ ఉద్యమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల మూడు నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. దేశం ప్రస్తుతం కీలక పరిస్థితులను ఎదుర్కొంటోందని, గత పదేళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటం, సామాజిక అసమానతలు, ప్రజాస్వామ్య విలువల క్షీణత వంటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం వాటి నుంచి దృష్టి మళ్లించేందుకు మతపరమైన ధ్రువీకరణ, విభజన రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. యువత పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి శ్రమిస్తున్నప్పటికీ నియామకాల ఆలస్యం, పరీక్షల రద్దు, వరుస పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరుద్యోగ యువత ఉద్యమం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కలిందర్ ఆలీ ఖాన్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, దేవి పోచన్న, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, మొగిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

# ప్రత్యేక "సైబర్ జాగృతి దివస్

**– సురక్షా కా తిరంగా"తో సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం**
**– "అప్రమత్తంగా ఉండండి... అవగాహనతో వ్యవహరించండి... సైబర్ సురక్షితంగా ఉండండి."**
**– ప్రత్యేక సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను విడుదల చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**
**స్టే అలర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగష్టు 4, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ గారి ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి నెల మొదటి బుధ వారం నిర్మల్ జిల్లాలో "సైబర్ జాగృతి దివస్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తెలిపారు. ఈ నెల స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని "సురక్ష కా తిరంగ– స్టే అలర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" అనే సందేశంతో ప్రత్యేక సైబర్ జాగృతి దివస్ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా నకిలీ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, అధిక లాభాల పేరుతో వచ్చే ప్రకటనలు, ప్రముఖుల ఫొటోలు, మార్ఫింగ్/మానిప్యులేటెడ్ వీడియోలు, నకిలీ సంస్థల పేర్లు, లోగోలతో వచ్చే పెట్టుబడి ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. ట్రేడింగ్ యాప్ లేదా డ్యాష్‌బోర్డ్‌లో భారీ లాభాలు కనిపిస్తున్నంత మాత్రాన నిజంగా డబ్బు పెరుగుతోందని భావించవద్దని తెలిపారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా ప్లాట్‌ఫామ్ విశ్వసనీయతను, దాని అధికారిక వెబ్‌సైట్, యాప్ డౌన్‌లోడ్ సోర్స్‌ను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. కేవలం ఆకర్షణీయమైన ప్రకటనలు లేదా ప్రముఖుల పేర్లను చూసి డబ్బులు బదిలీ చేయవద్దన్నారు. "అలర్ట్ నెస్ ం అవేర్ నెస్ = సైబర్ సేఫ్టీ " అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, సైబర్ నేరాలపై అవగా హనే సైబర్ మోసాల నుంచి రక్షణకు అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అంటూ సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రమణ, ఆర్ఐ రామ్ నిరంజన్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీరామ హృదయ కలశ కార్యక్రమం







**– ఖానాపూర్ లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
**– మంగళహారవతులతో మేల తాళాలతో కలశాల ఊరేగింపు**
**– శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వికాస తరంగిణి**
**– ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల్లో 1008 ఆలయాల సందర్శన**





**ఖానాపూర్ ఆగష్టు 4 (ప్రజా జ్యోతి) :** శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని (పుట్టినరోజు) రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల్లో ఒక వెయ్యి ఎనిమిది ఆలయాలలో కలిశారాధన జరిపి ఆ కలశాలను స్పర్శించి ప్రతి భక్తులు కొద్ది అక్షతలు మేర బియ్యాన్ని అందులో సమర్పించి శ్రీరామ హృదయ కలశ స్పర్శతో సుఖశాంతులు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు కలగాలని జీయర్ స్వామి రానున్న దీపావళి వరకు జరిగే పుట్టినరోజు కు భాగ్యనగరం హైదరాబాదులోని శంషాబాద్ సమీపాన గల ముచ్చింతల్ రామానుజ ట్రస్ట్ కు చేరుతోందని వికాస తరంగిణి బాధ్యతలు తెలిపారు

నిర్మల్ జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కలశాలు ఆయా దేవాలయాల్లోకి స్వాగతం పలికి దాంట్లో భాగంగా ఖానాపూర్ పట్టణంలోని ఉత్తర వాహిని అత్యంత పవిత్ర పురాతనమైన శ్రీ సీతారామచంద్ర ఆంజనేయ ఆలయంలో మొదట కళాశాలకు పూజలు అర్చకులు విష్ణుభట్ల రాజశేఖర్ శర్మ తో నిర్వహించగా మహిళలు మేళ తాళాలతో మంగళారతుల తో ఘనంగా కలశాలను ఎదుర్కొని ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరించి తల అక్షంతల మేర బియ్యాన్ని కలశంలో వేసి కృతజ్ఞులయ్యారు ఈ సందర్భంగా ఆ ఆలయాల కమిటీ సభ్యులను లేదా పెద్దలను వికాస తరంగిణి తరపున చిరు సత్కారాలు చిన్న జీయర్ స్వామి తరపున శాలువాలతొ జిల్లా వికాస తరంగిణిఅధ్యక్షులు విజయకుమార్ తదితర వికాస సభ్యులు శ్రీరామ్ నగర్ లోని ఆలయ కమిటీ ఎలిశెట్టి లింగేశ్వర్ చంద్రహాస్ పంబాల భీమేశ్వర్ డాక్టర్ రాము , ఆయన ద్వారా జనార్ధన్ పిసర రామ్ చందర్ హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు అల్లాడి వెంకటేశ్వర్లను సన్మానించి చిన్న జీయర్ స్వామి మంగళ శాశాలను అందించారు అనంతరం పద్మావతి నగర్ లో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో అక్కడ ఘన స్వాగతంతో ఆలయంలో కలశ పూజలు వేద పండితులు చక్రపాణి నరసింహ మూర్తి నిర్వహించి కలశ వృత్తాంతాన్ని భక్తులకు తెలియపరచగా ఆలయ అధ్యక్ష కార్యదర్శులు అడ్డకట్ల రాజన్న నిమ్మల రమేష్ లను సన్మానించారు అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామి కరకమంలో చే ప్రారంభించబడిన విద్యానగర్లోని గోదా కృష్ణ మందిరంలోనూ ఘనంగా కలశానికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ శాసనాలను భక్తులకు ఆలయ అర్చకులు వద్దిపర్తి వెంకటరమణాచార్యులు అందజేశారు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న రామానుజ జీయ్యరు స్వామి ఆదేశానుసారం ఖానాపూర్ పట్టణంలో మంగళవారం శ్రీరామ హృదయ కార్యక్రమం ఘనంగా మూడు ప్రాంతాల్లో జరిగింది ఈ కార్యక్రమంలో తుమ్మనపల్లి లక్ష్మణ్ రామ్ లక్ష్మణ్ ప్యాలల భీమన్న కొత్తపల్లి సురేష్ కుమార్ హిందూ ఉత్సవ అధ్యక్షులు మంత్రరాజ్యం సురేష్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షులు మంత్రరాజ్యం దేవేందర్ ఆసూరి సంతోష్ కుమార్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మహాజన్ జలంధర్ హిందూ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షులు రాచమల్ల రాజశేఖర్ కొత్తపల్లి సురేష్ కుమార్ కటకం శేఖరయ్యతో పాటు వికాస తరంగణి జిల్లా సభ్యులతోపాటు ఖానాపూర్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర, లక్ష్మీ వెంకటేశ్వర, కృష్ణ గోదా మహిళా మణులు వందలాది సంఖ్యలో పాల్గొని మంగళహారలతో కలశానికి స్వాగతం పలికి చిన జీయర్ స్వామి తిరు నక్షత్రం సందర్భంగా శ్రీరామ హృదయ కళాశా స్పర్శ పుణ్యాన్ని పొంది పునీతులయ్యారు అనంతరం ఈ కలశాలు మండలంలోని మస్కాపూర్ తో పాటు పెంబి తదితర దేవాలయాల్లో ఈరోజు యధావిధిగా కార్యక్రమాలు వికాస తరంగిణి నిర్వహించుకున్నారు.

### నేటి నుంచి జంతర్‌మంతర్‌లో

# సహారా బాధితుల నిరవధిక ధర్నా

**మంచిర్యాల నుంచి భారీగా తరలిన బాధితులు**



**మంచిర్యాల, 4,ఆగష్టు (ప్రజాజ్యోతి) :** న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆగష్టు 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న సహారా బాధితుల నిరవధిక ధర్నాలో పాల్గొనేందుకు మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి సహారా బాధితులు, ఏజెంట్లు, సిబ్బంది, డిపాజిటర్లు మంగళవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో న్యూఢిల్లీకి భారీగా బయలుదేరారు. సహారా ఇండియాలో డిపాజిట్లు చేసిన ప్రజలకు న్యాయం చేయాలని, మెచ్యూరిటీ పూర్తయిన డిపాజిట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారు ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సహారా బాధితుల సంఘం, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ దేశంలోని 29 రాష్ట్రాల్లో సహారా ఇండియాలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి గడువు పూర్తయినప్పటికీ ఇప్పటికీ తమకు రావాల్సిన సొమ్ము అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది డిపాజిటర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని డిపాజిటర్లకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా సహారా ఇండియాలో విధులు నిర్వహిస్తున్న సుమారు 15 లక్షల మంది సిబ్బంది ఉపాధి, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. డిపాజిటర్లతో పాటు సహారా సిబ్బంది సంక్షేమాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అలాగే సుప్రీంకోర్టు తక్షణమే జోక్యం చేసుకుని దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 13 కోట్ల మంది సహారా బాధితులకు రావాల్సిన రూ.40 వేల కోట్ల బకాయిలను విడుదల చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సహారా సంస్థలో పనిచేస్తున్న 15 లక్షల మంది సిబ్బంది సమస్యలను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా సహారా బాధితులు, సిబ్బంది సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సహారా పేమెంట్ల సాధనే లక్ష్యంగా జంతర్‌మంతర్ వద్ద ఆగష్టు 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు నిరవధిక ధర్నా నిర్వహిస్తు న్నట్లు సహారా ఏజెంట్లు, డిపాజిటర్లు తెలిపారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి బెల్లంపల్లి వరకు సుమారు 250 మంది సహారా ఏజెంట్లు, డిపాజిటర్లు, బాధితులు న్యూఢిల్లీకి తరలివెళ్లినట్లు వెల్లడించారు. తమకు రావాల్సిన పేమెంట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నిరవధిక ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.

మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో సహారా బాధితులు, ఏజెంట్లు నినాదాలు చేస్తూ ఢిల్లీకి బయలుదేరారు. "సహారా బాధితులకు న్యాయం చేయాలి", "మెచ్యూరిటీ డిపాజిట్లను వెంటనే చెల్లించాలి", "సహారా సిబ్బందిని ఆదుకోవాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సహారా మేనేజర్ ఎస్.టి. రావు, కళ్యాణ్‌తో పాటు పలువురు సహారా ఏజెంట్లు, సిబ్బంది, డిపాజిటర్లు, సహారా బాధితులు పాల్గొన్నారు.

## పల్లె సంపదపై పట్టింపు కరువాయేనా?.





**కొమరం భీం జిల్లా బ్యూరో ప్రతినిధి (వాంకిడి) ఆగష్టు 04 ప్రజా జ్యోతి :** కొమురం భీం జిల్లా కేంద్రంలో ని గ్రామపంచాయతీ లో గల సహజ సంపద పై పట్టింపు లేని పరిస్థితి ప్రజల అభివృద్ధి కొరకు ఆయా పంచాయతీ పరిధిలో గల సహజ వనరులను పంచాయితీ పరిపాలనకు ప్రజల అభివృద్ధికి అండగా నిలవాల్సిన సహజ సంపద ఇక్కడి ప్రాంతానికి ప్రజా అభివృద్ధికి అందకపాయే పంచాయితీ పరిపాలన పట్టించుకోకపోగా ప్రభుత్వ ఆస్తులను కాపాడలేని పరిస్థితి నెలకొన్న వైనం గ్రామాల్లో గల సహజ సంపదపై అవగాహనతో గ్రామ అభివృద్ధికి కృషి చేసే విధంగా చూడాలని కోరిన స్థానికులు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ఆసిఫాబాద్ మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక**



**ఆసిఫాబాద్ ఆగష్టు 4 ప్రజా జ్యోతి :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోడిసెల కార్తిక్ కోరారు. జిల్లాలో పలు విద్యాసంస్థల్లో సరైన తరగతి గదులు లేక విద్యార్థులు ఇరుకైన గదుల్లోనే చదువుకుంటున్నారని తెలిపారు. వసతిగృహాలకు సొంత భవనాలు లేక కిరాయి భవనాల్లో కొనసాగుతున్నాయని, మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యాలు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందడం లేదని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై ఆసిఫాబాద్ మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయి చరణ్, కార్యదర్శిగా సాగర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శ్రీధర్, కార్తీక్, విజయ్, శేఖర్, చందన్, సహాయ కార్యదర్శులుగా నితిన్, రవి, మహేష్, సిద్ధార్థ్ ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా ఉదయ్ చరణ్, మధుకర్, వంశీకృష్ణ, రత్నాకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం



**మంచిర్యాలరూరల్ ఆగష్టు 04 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మాతా–శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్,లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, తల్లిపాలే శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా అని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించి, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు పోషకాహారం,వ్యాధి నిరోధక శక్తిని అందించడంతో పాటు తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని వివరించారు. అనంతరం నవజాత శిశు విభాగాన్ని పరిశీలించి వైద్య సేవలపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపెరండెంట్ డా.అశోక్ కుమార్,ఆర్ఎంఓ డా.శ్రీధర్,డెమో బుక్క వెంకటేశ్వర్లు,సీడీపీఓలు,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది,నర్సింగ్ విద్యార్థులు,లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంగాదేవి బోనాలను విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా తెలంగాణ గంగాపుత్ర సంఘం పిలుపు**



**మంచిర్యాల, 4, ఆగష్టు (ప్రజాజ్యోతి) :** తెలంగాణ గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు 5 (బుధవారం) నిర్వహించనున్న శ్రీ గంగాదేవి బోనాల జాతరను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా తెలంగాణ గంగాపుత్ర సంఘంస ంఘం నాయకులు గంగాపుత్రులు, పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంగాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారి కృపా కటాక్షాలను పొందాలని కోరారు. గంగాదేవి ఆశీర్వాదం గంగాపుత్ర సమాజంపై ఎల్లప్పుడూ ఉండేలా ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్‌తో పాటు గాండ్ల రాజ్‌కుమార్, సూర్ల శంకర్, గుమ్ముల పోషం, అరెందుల రాజేశం, శకపూరి భీమసేన్, సూర్ల రాజు, గాండ్ల శంకర్, సూర్ల బుచ్చయ్య, ఎల్లెల రమేష్, సూర్ల భీమయ్య, గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రత్యేక విడత అడ్మిషన్లు



మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 04 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల మఖ్తల్‌లో దోస్త్ ప్రత్యేక విడత ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలోకి అడ్మిషన్లు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇ.నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ,ఇప్పటివరకు దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు సీటు వచ్చి కూడా కళాశాలలో చేరనివారు, కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రత్యేక విడతలో అడ్మిషన్ పొందవచ్చని ఆయన తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

## భూభారతి అమలులో జూనియర్ అసిస్టెంట్లదే కీలక పాత్ర

### రిజిస్ట్రేషన్లపై పూర్తి అవగాహనతో పనిచేయాలి
### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి): భూభారతి విధానం ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా జూనియర్ అసిస్టెంట్లు పూర్తి అవగాహనతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ




మందిరంలో జిల్లాలోని వివిధ మండలాల జూనియర్ అసిస్టెంట్లకు భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖలో భూభారతి విధానం కీలకమైనదని, రైతులు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆ లక్ష్య సాధనలో జూనియర్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, డిజిటల్ సంతకాలు, సంబంధిత పత్రాల పరిశీలన వంటి ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. లాగిన్ ప్రక్రియ నుంచి దరఖాస్తుల ఆమోదం వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించి సాంకేతిక లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, శిక్షణలో కలిగే సందేహాలను మాస్టర్ ట్రైనర్ల ద్వారా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి భాను ప్రకాష్, మాస్టర్ ట్రైనర్లు, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆగస్టు 10లోగా యూనిఫాంల కుట్టు పనులు పూర్తి చేయాలి

### – నాణ్యతతో పాఠశాలలకు సకాలంలో అందించాలి
### – అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేయనున్న యూనిఫాంల కుట్టు పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ఆగస్టు 10లోగా పాఠశాలలకు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం వనపర్తి మున్సిపాలిటీలోని మెప్మా




ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టిచ్చింగ్ సెంటర్‌తో పాటు వనపర్తి మండలం రాజపేట గ్రామంలోని సెర్ప్ స్టిచ్చింగ్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి యూనిఫామ్‌ను నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా కుట్టి ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని, పనులను వేగవంతం చేసి ఆగస్టు 10వ తేదీలోగా పూర్తిచేసి సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, డీపీఎం, మెప్మా, సెర్ప్ అధికారులు, స్టిచ్చింగ్ సెంటర్ల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూరాల జలాలతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### జూరాల కుడి కాలువ ద్వారా ఆర్‌డీఎస్ లింక్ కెనాల్స్‌కు నీటిని మళ్లించేలా చర్యలు
### కాలువల మరమ్మత్తులు,నిర్వహణ పనులు వేసవిలోనే పూర్తి చేయాలి

గద్వాల జిల్లా,ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి): జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రస్తుతం వస్తున్న వరద నీటిని



సద్వినియోగం చేసుకుని జిల్లాలోని అన్ని రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపితే ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు మ్యాప్,వివిధ రిజిస్టర్లు పరిశీలించి,కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కృష్ణా నదికి వస్తున్న వరద,జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం,గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీరు,ఎత్తిపోతల పథకాలు,సమాంతర కాలువలకు వినియోగిస్తున్న నీటి వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రాజెక్టు గేట్లను పరిశీలించి,యంత్రాల పనితీరు,సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. పవర్‌హౌస్‌లో జలవిద్యుత్ ఉత్పత్తిపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులతో పాటు ఇతర నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని సూచించారు.చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలని పేర్కొన్నారు.నిర్వహణకు ప్రభుత్వం కేటాయించే నిధులను సక్రమంగా వినియోగిస్తే సమస్యలు తలెత్తవని అన్నారు.జూరాల కుడి కాలువ ద్వారా



ఆర్‌డీఎస్ పరిధిలోని లింక్ కెనాల్స్‌కు నీటిని మళ్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో అలంపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్నందున వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తున్నప్పటికీ,ప్రస్తుతం కాలువల ద్వారా నీటి లభ్యత ఉండటంతో వరి సాగుకు అవకాశం ఉందన్నారు.అయితే రైతుల పంటలు చేతికొచ్చే వరకు సాగునీటి సరఫరాపై సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెందొడ్డి,ర్యాలంపాడు తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. అలాగే వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సందర్శకులు ఘాట్ల వద్ద నీటిలోకి దిగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ప్రతిపాదనలు పంపి నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న నిర్వాసితులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్‌ఈ కేశవరావు,డీఈ నాగేశ్వరరావు,తహసీల్దార్ నందిని తదితర అధికారులు పాల్గొన్నారు.

## డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా నివారణకు ప్రత్యేక చర్యలు

### ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమం తప్పనిసరి
### వర్షాకాల వ్యాధుల నియంత్రణపై డీఎంఅండ్‌హెచ్‌ఓ సాయినాథ్‌రెడ్డి ఆదేశం

వనపర్తి, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి): జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా





వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, పట్టణాల్లో తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. సాయినాథ్‌రెడ్డి ఆదేశించారు.
మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఆరోగ్య విద్యాధికారి, ఆరోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా–శిశు ఆరోగ్య సేవలు, సాధారణ టీకాల కార్యక్రమం, జాతీయ నులిపురుగుల నివారణ, కుటుంబ నియంత్రణ, అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) నియంత్రణ, అంటువ్యాధుల పర్యవేక్షణ, వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య సంస్థల పనితీరుపై సమగ్రంగా సమీక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, కూలర్లు, వాటర్ ట్యాంకులు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, గర్భిణులు, బాలింతలు, శిశువులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వంద శాతం టీకాకరణ పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించి నివేదికలను గడువులోగా సమర్పించాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. భాస్కర్ నాయక్, టీబీ నోడల్ అధికారి డా. వంశీ, డీఐఓ డా. పరిమల, ఎన్‌సీడీ నోడల్ అధికారి డా. మారుతి నందన్, ఎపిడెమియాలజిస్టు సుమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మారుతున్న ప్రపంచానికి తగ్గట్టుగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ): విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పాఠ్య విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని పి.ఎం.శ్రీ కేంద్రీయ






విద్యాలయాన్ని సందర్శించిన ఆమె, నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
పాఠశాలలో నెలకొల్పిన క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యా వాతావరణం, విద్యార్థుల్లో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం తనను ఆకట్టుకున్నాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో ఈ స్థాయి ప్రతిభ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. పి.ఎం. శ్రీ పథకం ద్వారా ఆధునిక మౌలిక వసతులు, స్మార్ట్ తరగతి గదులు, అత్యాధునిక ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.
ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆవిష్కరణలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. టింకరింగ్ ల్యాబ్‌లు, వృత్తి విద్యా ప్రయోగశాలలు, ఇన్నోవేషన్ సెంటర్లు సృజనాత్మకతతో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంజనీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు, అధికారులు, కళాకారులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించిన కలెక్టర్, పాఠ్యాంశాలతో పాటు ప్రపంచ పరిణామాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 12వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించాలని, క్రమశిక్షణతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.ఎం.శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు వై. సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపుతో మహబూబ్‌నగర్‌ను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలి

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులదే కీలక బాధ్యత : అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నాణ్యమైన విద్య అందించడం, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపు వంటి అంశాల్లో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ అన్నారు. విద్యారంగంలో





మహబూబ్‌నగర్ జిల్లాను తెలంగాణలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ప్రధానోపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.
మంగళవారం మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి కలిసి సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం, పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడం ప్రధానోపాధ్యాయుల సమర్థ నాయకత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున విద్యారంగ అభివృద్ధికి అవసరమైన సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల నాయకత్వమే విజయానికి పునాదని అన్నారు. ఉపాధ్యాయ బృందాన్ని సమన్వయం చేస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పర్‌ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ లో మహబూబ్‌నగర్ జిల్లాను తెలంగాణలోనే నంబర్–1 స్థానంలో నిలిపే బాధ్యత ప్రతి ప్రధానోపాధ్యాయుడిపై ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సెంటర్ ఇన్‌చార్జి బాసిత్, డీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## భోజన టెండర్లకు ఆహ్వానం

నాగర్ కర్నూల్ : ఆగస్టు 4 (ప్రజాజ్యోతి): నాగర్ కర్నూల్ యూనియన్ బ్యాంక్ ఆర్ సెటి శిక్షణార్థులకు టిఫిన్,మధ్యాహ్న భో జనం,స్నాక్స్ సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు.అస క్తి గల కాంట్రాక్టర్లు ఈనెల 25 న, సా 5:00 లో పు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు ఫోన్ నెం.9494675667 లో సం ప్రదించాల న్నారు.

## వైభవంగా అంబాభవాని శోభాయాత్ర.. భవాసర్ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా 46వ బోనాల పండుగ

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 04 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలో భావాసర్ క్షత్రియ సమాజ్ తరపున ఆషాడ మాస మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున భవానీ మాతకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం నుండి భవాని మాత దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మఖ్తల్ భవసార క్షత్రియ సమాజ్ అధ్యక్షులు బోడికే సత్యనారాయణ రావు మాట్లాడుతూ 46 సంవత్సరాలు నుంచి జరుపుకుంటున్న ఆషాడ మాస వన భోజన కార్యక్రమం ఆనవైతిగా రావడంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.
ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది భవసార క్షత్రియులు టైలర్ "రంగ్రేజ్" లను ఇప్పటికి కూడా తల కులవృత్తిని సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవసార సమాజ్ రంగ్రేజ్ టైలర్ లను గుర్తించాలని కొన్ని వేల కుటుంబాలు ఇప్పటికి కూడా పేదరికంలో





ఉన్నాయని ఆయన తెలిపారు.
తెలంగాణ ఏర్పడ్డ తర్వాత మా సమాజానికి గుర్తింపు రాలేదని ఇప్పటికన్నా రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి భవసార క్షత్రియ సమాజ్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య మాట్లాడుతూ వెనుకబడిన కులాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రభుత్వాలు వెంటనే స్పందించి వెనుకబడిన భవాసర్ సమాజ్ కుటుంబాలకు తన వంతు సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ భవసార సమాజం కు మంత్రి వాకిటి శ్రీహరి ఫంక్షన్ హాల్ కొరకు వచ్చే బోనాల పండుగ వరకు తన వంతు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ జైతినే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బహుసార సమాధి కుటుంబాలు కొన్ని లక్షల మంది ఇప్పటికి కూడా పేదరికంలో బతుకుతున్నారంటూ ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా భావాసర్ సార్ సమాజం గుర్తించలేదని ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించాలని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ వాకిటి మానస,పాలమూరు జిల్లా బవసార సమాజ్ అధ్యక్షుడు బాండేకర్ విశ్వనాథ్,కోస్గి అధ్యక్షులు అంబాదాసు రావు,మద్దూర్ అధ్యక్షులు జి. నారాయణరావు,బావ సార్ క్షత్రియ సమాజ్ ప్రెసిడెంట్ బోడికే సత్యనారాయణ,సెక్రటరీ రంగ్ దళ్ జీవన్ రావు,తేల్కర్ రాధా, క్షీరసాగర్, నారాయణరావు,కిషన్ రావు,కోశాధికారి నౌలే ఆనంద్,జాయింట్ సెక్రెటరీ సులకే నరసింహా రావు,పటికే శోభన్ బాబు,మహిళా అధ్యక్షురాలు మహేంద్ర కార్ విజయలక్ష్మి , వైస్ ప్రెసిడెంట్ నింకార్ మాధురి,సెక్రటరీ అనసూయ,కోశాధికారి సరిత,మాజీ ప్రెసిడెంట్ రంజన మహిళా సలహాదారులు బోడికే రేణుక బాయి,యువ పరిషత్ నీంకర్ శ్రీనివాసరావు,బోడికే అంబదాస్ రావు, తోపాటుకాలిత్కర్ సందీప్,కమిటీ మెంబర్లు డగే అంబాజీరావు,బి బాబురావు లక్ష్మణరావు నౌలె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## యోగాసన పోటీల్లో గురుకుల ప్రతిభ.. రాష్ట్రస్థాయికి దూసుకెళ్లిన విద్యార్థినులు





**పర్వతగిరి, ఆగస్టు 04 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలకేంద్రం లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థినులు యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై కావడం విశేషం. ఇటీవల హనుమకొండ సుబేదారిలో నిర్వహించిన ఏఎస్ఆర్ స్కిల్ హబ్ - యోగాసన భారత్ ఆధ్వర్యంలోని యోగా పోటీల్లో గురుకుల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఆరుగురు, అండర్-18 విభాగంలో ఇద్దరు విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ జోష్నా, వైస్ ప్రిన్సిపాల్స్, పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయ బృందం అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ప్రజా గాయకుడు గద్దర్ మూడో వర్ధంతి సభను విజయవంతం చేయాలి



**హసన్‌పర్తి, ఆగస్టు 4(ప్రజాజ్యోతి):** ప్రజా గాయకుడు గద్దరన్న మూడో వర్ధంతి సందర్భంగా ఈ నెల 6న సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే సంస్మరణ సభను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. గద్దర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మునిమనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, అలాగే ఎల్లాపూర్, హసన్‌పర్తి గ్రామాల్లో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మేధావులు, అంబేద్కర్ భావజాలాన్ని విశ్వసించే వారు, గద్దరన్న అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా కార్యదర్శి బౌతు రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు మేకల అనిత, వసంత, రాజు, సందీప్, రమేష్, మధు, మణెమ్మ, సుగుణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూలిన చెట్లను పరిశీలించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు



**మంగపేట, ఆగస్టు 04 (ప్రజాజ్యోతి) :** మంగపేట మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గత నెల జూలై 28 సాయంత్రం వీచిన భీకర టోర్నీడో బీభత్సానికి కూలిన వృక్షాలను కాళేశ్వరం ప్రాంతీయ లేదా సర్కిల్ స్థాయి అటవీ సంరక్షణాధికారి, ములుగు జిల్లా అటవీ క్షేత్ర అధికారి, తాడ్వాయి ఫారెస్టు డివిజినల్ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. సారవంతమైన నేలల్లో మొక్క యొక్క వేర్లు నేల పైభాగంలోనే విస్తరించి ఉండడం వలన బలమైన సుడిగాలుల ద్వారా సుమారు రెండు వందల పైన మొక్కలు వేర్లతో సహా నేలకొరగడం జరిగిందని తెలిపారు. ఇందులో తునికి, దుంపెన, తానిక్కాయ, విషముష్టి, యూకలిప్టస్, కూడుగా, కానుగ, జువ్వి, వేప, కుంకుడు తదితర చెట్లు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని అన్నారు. భూమి ఉపరితలంపై ఉన్న వేడి, తేమ గల గాలి వేగంగా పైకి లేవడం వలన బలమైన నిలువు గాలి ప్రవాహాలు ఏర్పడి, ఎత్తు పెరిగిన, దిశ మారినా మీసోసైక్లోన్ లాగ ఏర్పడి వాతావరణ అస్థిరత వలన సుడిగుండంలా వేగంగా గాలి పీడనంలోని తేడా వలన ముందుకు కదులుతూ, ఆ మార్గంలో ఉన్న చెట్లను, ఇళ్లను కబళించి తీవ్ర నష్టాన్ని కలుగ జేస్తుందని అన్నారు.గతంలో సైతం జిల్లాలో మేడారం ప్రాంతంలో సుమారు 800 ఎకరాలలోని అటవీ ప్రాంతంలో పూర్తిగా నెలకోరిగిన సంఘటన తెలిసిందే అన్నారు. ఫలితంగా సుమారు లక్షా యాభై వేల ఎత్తైన చెట్లు ఏటూరునాగారం అభయారణ్యంలో నేలకొరిగాయని అన్నారు. వీటన్నింటికి ముఖ్యకారణం స్వార్థ ప్రయోజనాల కోసం అనాలోచితంగా చెట్లను నరకడం, ఇసుక తీవ్రంగా తోడడం, మట్టిని తవ్వి నెల గుల్ల చేయడం, గుట్టలను తవ్వి నామ రూపాలు లేకుండా చేయడమే అన్నారు.

## చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం

### ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు



**ఆత్మకూరు, ఆగష్టు 04 (ప్రజా జ్యోతి) :** చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని ఎంపీపీఎస్ ఆత్మకూరు( గొల్లవాడ) పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాల (గొల్లవాడ) ఆవరణలోని అంగ న్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు మాట్లాడుతూ.. ఆగస్టు ఒకటో తారీకు నుంచి ఏడో తారీఖు వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారని ఇట్టి వారోత్సవాలలో తల్లిపాల ప్రాముఖ్యతను అందరు గుర్తించాలని అన్నారు. తల్లిపాలు తాగడం వలన చిన్నారులలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, చిన్నారుల ఎదుగుదలకు ఇది ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. ముర్రిపాలపై తల్లులలో కొంత అపోహ ఉందని కానీ ఇవి చిన్నారుల శారీరక ఎదుగుదలకు మంచి పోషకాలు అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దేవమ్మ, వాణి మరియు అంగన్వాడి ఆయా సరోజన మరియు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# విద్యా,వైద్య రంగానికి పెద్ద పీట

**- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి - పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క**







**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం విద్యా,వైద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ పెద్ద పీట వేస్తున్నదని,పలురకాల వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం ఉదయం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవ రావుతో కలసి మంత్రి నూతన సదరం శిబిరం, యుడిఐడి భవనాన్ని, ఆక్సిజన్ ప్లాంట్,ఆర్థోగ్రెనిక్, జనరల్ సర్జరీ,ఈఎన్ టి విభాగాలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వైద్య శాఖ మంత్రి దామోదర నరసింహ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని,రానున్న రోజులలో జిల్లా కేంద్రంలో ప్రత్యేక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా ఆసుపత్రి ఇరుకుగా ఉన్న కారణంగా మరో ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో కన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడం అభినందగ్గ విషయమని,ప్రైవేట్ హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి,వైస్ చైర్మన్ ఆయూబ్ షాహిన్, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి చంద్రశేఖర్,జిల్లా స్థాయి అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడాలి

- ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలను నిర్మించాలి.
- మహనీయుల వారసత్వాన్ని ముందుకు నడపాలి.
- గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ ప్రక్రియను చేపట్టాలి.



**ఆత్మకూరు, ఆగష్టు 04 (ప్రజాజ్యోతి) :** మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడాలని ఎంఆర్పీఎస్ హనుమకొండ జిల్లా ఇంచార్జి , ఎంఎస్పి జాతీయ నేత ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పి మరియు అనుబంధ విభాగాల జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ఇన్చార్జ్ నద్దునూరి రఘు కుమార్ మాదిగ సభ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ మాట్లాడుతూ.. నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకొచ్చి శక్తివంతమైన సైన్యంగా తయారుచేసేందుకు ఎంఆర్పీఎస్ శ్రేణులు శ్రమించాలన్నారు. మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేసి ఎస్సి వర్గీకరణను సాధించడమే కాకుండా మాదిగలతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు నడిపి పలు అనేక సంక్షేమ పథకాలు సాధించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతుందని, ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మిస్తుందని ఎంఆర్పీఎస్ హనుమకొండ జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ అన్నారు. ఈ దేశంలో దుర్మార్గమైన కుల వ్యవస్థ ఉండడం వలన వివక్షతకు గురై పేదరికంలోనే మిగిలిపోయామని, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు పేదరికన్ని నిర్మూలించేందుకు ఉద్యమించాలని అన్నారు. రాజకీయ చైతన్యాన్ని సృహను విడువకుండా బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని అందుకు గ్రామ స్థాయిలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాడాలని అన్నారు. అన్ని అనుబంధ విభాగాల కమిటీలు రద్దు అయిన సందర్భంగా నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని అన్ని అనుబంధ విభగాలను సంస్థగతంగా పునరనిర్మాణం చేసుకొని శక్తివంతంగా తయారు చేయాలని అన్నారు. నూతన విద్యార్థి, యువ తరాన్ని ఉద్యమంలోకి తీసుకోచ్చి క్షేత్ర స్థాయిలో శ్రమించాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాల సాధనకి, పీడిత వర్గాల విముక్తికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఇచ్చిన ఉద్యమ కార్యాచరన విజయవంతం కోసం నాయకులందరు పనిచేయాలని, నూతన కమిటీలు, అన్ని గ్రామాలు, మండలాలు, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని బలంగా తయారు కావాలని అందుకు శ్రేణులు గ్రామాలకు తరలాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి. కో ఇన్చేర్జిలు హర్షం సుధాకర్ మాదిగ వేల్పుల గణేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కొమ్ముల సురేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ పెద్దాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలుకటి అనిల్ మాదిగ విహెచ్పిఎస్ నాయకులు ఎలకటి బాలరాజు ఎంఆర్పిఎస్ నాయకుడు హర్షం రాజుకర్ మాదిగ హర్షం విక్రమ్ మాదిగ హర్షం సతీష్ మాదిగ హర్షం ప్రశాంత్ మాదిగ నాగారపు మొగిలి మాదిగ నదునూరి రాజు మాదిగ హర్షం రంజిత్ మాదిగ మాదిగ కొడపాక రాజు మాదిగ హర్షం కళ్యాణ్ మాదిగ కలకోటి రాజేష్ మాదిగ హర్షం బిక్షపతి మాదిగ హర్షం పవన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి









**- పోటీ ప్రపంచంతో పోటీపడాలి**
**- పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలి**
**- పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క.**

**వెంకటాపూర్/ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి) :** విద్యార్థినీ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో పోటీ పడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల 30 లక్షల రూపాయల తో నిర్మించిన నూతన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం,అదనపు తరగతి గదులు,ప్రయోగశాల భవనాలను ములుగు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని, ప్రపంచంలో మానవుడు తలుచుకుంటే సాధ్యం కాంతి ఏమీ లేదని అన్నారు. గొప్ప చదువులు చదివి సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని,ప్రతి ఒక్కరికి సంస్కారం,ధ్యానం ఎంతో అవసరమని సూచించారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు నూతన విద్యాబోధన చేసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. రానున్న పరీక్ష ఫలితాలలో రాష్ట్రస్థాయిలో విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు విద్యను బోధించాలని,ప్రభుత్వం విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య తలెత్తిన ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని,వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచంలో మహిళలు ఏమి తక్కువ కాదని,మహిళలు గొప్ప పదవులు నిర్వహించి ప్రపంచంలో అగ్రగామిలో నిలిచారని అన్నారు.ప్రతి విద్యార్థి పాఠశాల పరిసర ప్రాంతాలలో ఒక్క మొక్కను నాటి సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలని,చెట్ల తోనే అహల్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యా బోధన పై పిల్లలకు అందిస్తున్న ఆహారంపై పరిశీలించడానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని మంత్రి అన్నారు.అంతకు ముందు పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం రూ.61.99 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్దేశించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి,టూరిజం,డిఈ నటరాజ్,ఏఈ విజయ్,ఈఓ సిద్ధార్థ రెడ్డి,డిఈ అరుణ్ కుమార్,ప్రత్యేకఅధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హలో బిసి..ఛలో బెంగళూరు... వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

### డాక్టర్ పి గోపాల్,డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట ఆగస్టు 4 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న బెంగుళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ పిగోపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షులు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్‌లు బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించే అఖిలభారత జాతీయ ఓబీసీ 11వ మహా సభకు బీసీ నాయకులు పాల్గొని ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. బీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచి బీసీలకు 50% చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బొనగాని రవీందర్, గాదె భద్రయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, బీసీ నాయకులు ఒడిసెల శ్రీనివాస్, గుంటుక రాజ్ కుమార్, కందికొండ సురేష్, అక్కపెల్లి కిషోర్ వినోద్ కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డివిజన్ కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం



**హసన్‌పర్తి, ఆగస్టు 4(ప్రజాజ్యోతి):** గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు నేపథ్యంలో హసన్‌పర్తి 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని విజయ గార్డెన్‌లో జరిగిన ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన, ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాల నాయకులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా కమిటీని ఏర్పాటు చేస్తామని గొర్రె కిరణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### నాలుగో వార్డ్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి



**నర్సంపేట ఆగస్టు 4 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి సమక్షంలో రిటైర్డ్ పోస్ట్ మాస్టర్,వల్లబ్ నగర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గొంది సమ్మయ్య 5000 రూపాయలతో పర్యావరణ పరిరక్షణ కై వల్లబ్ నగర్ లోని హనుమాన్ దేవాలయం ప్రభుత్వ స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్వచ్ఛందంగాముందుకు వచ్చి వృక్షారోపణ కార్యక్రమాన్ని చేపట్టిన గొంది సమ్మయ్యకి కృతజ్ఞతలు తెలియజేశారు. మొక్కలు నాటడం ద్వారా స్కూల్‌కి పిల్లలకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి అని అన్నారు. క్రమం తప్పకుండా నీరు పోసి, నాటిన మొక్కలు వృక్షాలుగా మారేంతవరకు వాటి బాధ్యత తీసుకుంటామని అని అన్నారు.ఈ కార్యక్రమంలో వల్లబ్ నగర్ బొడ్రాయి, అధ్యక్షులు గట్టి పాపయ్య,గ్రామ వైస్ ప్రెసిడెంట్ ముత్యాల సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ వార్డు ఉపాధ్యక్షులు ఎదరబోయిన రాజేందర్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఎస్టీ బాలికల వసతి గృహం ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసు

**వర్ధన్నపేట ఆగస్టు 4,ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కారణంగా 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్ ఆర్‌సీ) సుమోటోగా కేసు నమోదు చేసి విచారణకు ఆదేశించింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేసిన కమిషన్, ఘటనకు సంబంధించి వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తలను పరిగణనలోకి తీసుకుని స్వయంగా విచారణ ప్రారంభించింది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, అస్వస్థతకు గురైన విద్యార్థినుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన వైద్య చికిత్స వివరాలు, వసతి గృహంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై నిర్వహించిన విచారణ, బాధ్యులపై తీసుకున్న చర్యలు, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన నివారణ చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ నివేదికను సెప్టెంబర్ 7లోగా కమిషన్‌కు సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## విద్యార్థినిని సన్మానించిన గ్రీన్ వుడ్ పాఠశాల యజమాన్యం





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 4 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రీన్ వుడ్ పాఠశాల పూర్వ విద్యార్థినిని గ్రీన్ వుడ్ పాఠశాల యజమా న్యం ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాల్లో దాసరి సమ్మయ్య కుమార్తె దాసరి అశ్విత 649వ ర్యాంకు సాధించినందుకు అభినందిస్తూ శాలువాతో పాఠశాల యజమాన్యం సత్కరించారు. పాఠశాల కరస్పాం డెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇంతకుముందు చాలామంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అదేవిధంగా అశ్విత కూడా ఈ ర్యాంకును సద్వినియోగం చేసుకొని అత్యున్నత స్థానాలకు ఎదిగి మన మహాదేవపూర్ లాంటి మారుమూల ప్రాంత ప్రజలకు ఉచిత సేవలు చేయా లని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రిన్సిపల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ తోట రాజ్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్రికా కథనాన్ని ఖండించిన దూదిపాల రజిత

## కబ్జా ఆరోపణలు అవాస్తవం అసలు ఆక్రమణదారులను గుర్తించాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 4,(ప్రజాజ్యోతి):
చింతకుంట గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ సీలింగ్ భూమిపై ఇటీవల దినపత్రికలో ప్రచురితమైన వార్తలో తనపై వచ్చిన కబ్జా ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని దూదిపాల రజిత స్పష్టం చేశారు. ఈ మేరకు మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో)కు ఆమె వినతిపత్రం సమర్పించారు.తన పేరు మీద ఉన్న పట్టా భూమిని తాము ఎలాంటి అక్రమ కబ్జా చేయలేదని, తమ అత్త దూదిపాల రుక్మిణి పేరు మీద ఉన్న భూమిని కుటుంబ సభ్యులందరి సమ్మతితోనే తమ పేరుకు బదిలీ చేసుకున్నామని తెలిపారు. ఆ భూమి పూర్వీకుల ఆస్తిగా భావించి మాత్రమే ఈ ప్రక్రియ జరిగిందని, ప్రభుత్వ భూమిని ఆక్రమించే ఉద్దేశం ఎప్పుడూ లేదన్నారు.గతంలో ఆ ప్రాంతంలో నీరు లేని సమయంలో మ కుటుంబ పెద్దలు మా మామ గారి తండ్రి దూదిపాల నారాయణరెడ్డి వారి సతీమణి బుచ్చమ్మ,దూదిపాల పాపిరెడ్డి తండ్రి నారాయణ రెడ్డి,దుదిపాల సునంద భర్త పాపి రెడ్డి ,దుదిపాల సుమతమ్మ భర్త మధుసూదన్ రెడ్డి గారి దహన సంస్కారాలు అదే ప్రాంతంలో నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం అక్కడ నీరు చేరడంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో దహన సంస్కారాలు నిర్వహించడం లేదని వివరించారు.ప్రభుత్వ సీలింగ్ భూమిగా తేలితే సర్వే నంబర్–12లో ఉన్న 23 ఎకరాల 17 గుంటల భూమిని సమగ్రంగా సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి, ప్రస్తుతం కబ్జాలో ఉన్న అసలు వ్యక్తులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్వోను కోరారు. ఆ భూమిని పరిరక్షించి గ్రామ ప్రజల ప్రయోజనాలకు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, దూదిపాల రుక్మిణి పేరుపై ఉన్న పట్టా రికార్డులు చెల్లుబాటు కాకపోతే వాటిని తొలగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో విచారణకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం వాస్తవాలను వెలికితీసి నిజమైన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# కోదాడ ఖేలో ఇండియా సెంటర్‌లో ఉచిత కబడ్డీ శిక్షణ

## జాతీయ స్థాయి క్రీడాకారుడు కోచ్‌గా నియామకం

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 04(ప్రజాజ్యోతి):
కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్‌లో కబడ్డీ క్రీడాకారులకు ఉచిత శిక్షణ కొనసాగుతోందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి.వెంకట్ రెడ్డి తెలిపారు.ఇప్పటివరకు శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో పాటు కొత్తగా కబడ్డీలో శిక్షణ పొందాలనుకునే వారికి కూడా నాణ్యమైన శిక్షణ అందించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారుడిని కోచ్‌గా నియమించినట్లు వెల్లడించారు.ప్రతి రోజు ఉదయం 6.00 గంటల నుంచి 8.30 గంటల వరకు,సాయంత్రం 4.30 గంటల నుంచి 7.00 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కబడ్డీపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం కబడ్డీ కోచ్‌ను 9515927426 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోతు రాజారాం ఏకగ్రీవ ఎన్నిక



తుంగతుర్తి, ఆగస్టు 4,(ప్రజా జ్యోతి):
ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోతు రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మూడో మహాసభ లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజారాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజారాం ఎన్నిక పట్ల తుంగతుర్తి నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు శ్యాంసుందర్, కోట రామస్వామి, పాల్వాయి పున్నయ్య, గూడ నరసయ్య, నజీర్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కార్మికుల హక్కుల సాధన కోసం ఆయన సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# ధర్నా నిర్వహిస్తే తప్ప రోడ్డు పూర్తవదా..

నార్కట్ పల్లి, ఆగస్టు 4( ప్రజా జ్యోతి ):
నార్కట్ పల్లి రహదారులు దుస్థితి ఆచమ్య గోచరంగా మారింది. మండల కేంద్రానికి



కూత వేటు దూరంలో బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకులు నార్కట్ పల్లి మండలం నుండి బయలుదేరుతున్నప్పటికీ ఈ మండలాన్ని అభివృద్ధి చేయాలన్న తపన వారికి లేదా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ధర్నా నిర్వహించి దాదాపుగా 15 రోజులు కావస్తున్న రోడ్డు వెంట గోతు తవ్వించినప్పటికీ అదే స్థానంలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అంతర్యం ఏమిటో తెలియడం లేదు. అధికారులు చొరవ తీసుకొని ఇప్పటికైనా గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న రోడ్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలు కోరుతున్నారు.

# పాలెం గ్రామంలో దశదిన కార్యక్రమం

నకిరేకల్ ఆగస్టు 4.ప్రజాజ్యోతి :
నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో కల్లేపల్లి పద్మ–రాములు దశదిన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బి ఆర్ యస్ వి నకిరేకల్ మండల నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఏకుల గణేష్, నాగిళ్ల వెంకటయ్య, కల్లేపల్లి శ్రీను, చింతమల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఏకుల నరేష్, నెల్లిబండ వినోద్, శివకుమార్, చింటూ తదితరులు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# అమరుల ఆశయ సాధనకు గీతన్నల చైతన్య యాత్ర

## గీత కార్మికుల హక్కుల కోసం ఆగస్టు 2–18 వరకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం కరివిరాలలో పోస్టర్ ఆవిష్కరణ

నడిగూడెం, ఆగస్టు 4: ప్రజా జ్యోతి:
గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా నిర్వహిస్తున్న అమరుల యాదిలో గీతన్నల



చైతన్య యాత్ర"ను విజయవంతం చేయాలని కరివిరాల గౌడ్ సంఘం అధ్యక్షుడు చింతలపాటి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరివిరాల గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో చైతన్య యాత్ర పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గీత కార్మికుడికి నెలకు రూ.4,000 పింఛన్, ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉపాధి భద్రతతో పాటు సమగ్ర సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయడమే ఈ చైతన్య యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆగస్టు 2 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ యాత్రలో గీత కార్మికులు, గౌడ్ సంఘాల నాయకులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రామయ్య, పుల్లయ్య, చలపతి, వెంకన్న, కాటమయ్య, కోటయ్య, పాపయ్య, సుధాకర్, ఉపేందర్, వెంకటేష్, అశోక్, నరేష్, సతీష్, రమేష్, తదితరులు పాల్గొని చైతన్య యాత్రకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

# పోలీసు భద్రత స్కీమ్‌తో హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత

## సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ అండగా ఉంటుంది సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 04(ప్రజాజ్యోతి):
సూర్యాపేట జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం చెందిన పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుటుంబానికి పోలీసు భద్రత స్కీమ్ కింద ఆర్థిక సహాయంగా నగదు చెక్కును జిల్లా ఎస్పీ కె.నరసింహ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,విధి నిర్వహణలో ఉండగా అకాల మరణం చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.పోలీసు భద్రత స్కీమ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు.దివంగత హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుటుంబ సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,డీఎస్పీ రవి,జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి,పోలీసు సంఘం అధ్యక్షుడు ఎస్ఐ రామచందర్ గౌడ్‌తో



పాటు పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 6న జీపు జాత అని జయప్రదం చేయండి

మునుగోడు, జూలై, 04,( ప్రజా జ్యోతి ):
మునుగోడు మండల కేంద్రంలోని సిపిఐ.ఆఫీసులో మండల కార్యవర్గ సమావేశం నిర్మించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఈదులకంటి కైలాస్ అధ్యక్షతన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి. శాసనమండలి సభ్యులు.





ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన నాటినుండి నేటి వరకు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ. ఎన్నికల ముందు బిజెపి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా. దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం ధరలు పెరుగుదల. విద్యార్థులు పేపర్ లీక్ పై ప్రజాస్వామ్యంగా ప్రజాబద్ధంగా వారికున్న హక్కు ప్రకారం నిరసన తెలిపితే ఢిల్లీలో కేంద్ర నిరంకుశ ప్రభుత్వం విద్యార్థులపై నాటి చారి చేయడం వారిపై కేసులు పెట్టడం సరైన విధానం కాదని జాతీయ పార్టీ పిలుపులో భాగంగా కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6.వ తేదీ నుండి. 14 వరకు జీపు జాత కార్యక్రమం మునుగోడు నుండి ఆగస్టు ఆరో తేదీన ప్రారంభమవుతుందని జీపు జాతను జయప్రదం చేయగలరని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోలుగూరి.నరసింహ. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి వెంకటేశ్వర్లు.సిపిఐ మండల కార్యదర్శి. చాపల శ్రీను మహిళా సమాఖ్య కార్యదర్శి మాధగోని సత్యమ్మ మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునుతల రమేష్ లాలు. చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య గోస్కొండ లింగయ్య మండల కౌన్సిల్ సభ్యులు ఉదయ్ కుమార్ ఆనగంటి నరసింహ భీమనపల్లి రమేష్. తదితరులు పాల్గొన్నారు

# సాగర్ ఆపద్బాంధవుడు పాండన్న.!

## బాధితురాలికి తక్షణ ఆర్థిక సాయం

హాలియా,ఆగస్టు4(ప్రజా జ్యోతి):
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి,భారీ వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన ఒక పేద కుటుంబానికి బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి (పాండన్న) కొండంత అండగా నిలిచారు.అనుముల మండలం అలీనగర్‌కు చెందిన రావిళ్ళ శ్రీదేవి ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రి ఖర్చులు భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు.ఈ విషయాన్ని గడ్డం రాకేష్ ద్వారా తెలుసుకున్న పాండన్న వెంటనే స్పందించారు.మంగళవారం నేరుగా బాధితురాలి నివాసానికి వెళ్ళి శ్రీదేవి ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు.ఆపదలో ఉన్న కుటుంబానికి ధైర్యాన్ని నూరిపోస్తూ,తక్షణ ఉపశమనం కోసం ఆర్థిక సాయం అందజేశారు.కష్టకాలంలో దేవుడిలా వచ్చి ఆదుకున్న పాండన్న ఉదారతపై స్థానికులు, బాధితురాలి కుటుంబ సభ్యులు అపారమైన హర్షం వ్యక్తం చేస్తూ ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి (సాగర్) మాజీ వైస్ ఎంపీపీ ఎడవల్లి దిలీప్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,బుసిరెడ్డి ఫౌండేషన్



ప్రతినిధులు పాల్గొన్నారు.

# 27 గ్రామపంచాయతీల బంజారాలను ఏకం చేసిన శీతలా భవాని ఉత్సవం

మల్లేపల్లి, ఆగస్టు 04,(ప్రజాజ్యోతి):
మల్లేపల్లి మండల కేంద్రంలోని మల్లెల గుట్టపై ఉన్న బంజారా భవన్ సమీపంలో బంజారా సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో ఎంపీటీసీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా ఒకే వేదికపైకి చేరి ఐక్యతను చాటారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువత, చిన్నారులు పాల్గొని బంజారా



నిర్వహించే శీతలా భవాని పండుగ ఘనంగా జరిగింది. బంజారా సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే ఈ వేడుకలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్, మల్లేపల్లి ఎంఈఓ నాగేశ్వర రావు, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి దాస్య నాయక్ హాజరై శీతలా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంజారా సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.మల్లేపల్లి మండల పరిధిలోని 27 గ్రామపంచాయతీలకు చెందిన తండాల నుంచి బంజారా నాయకులు, గ్రామ పెద్దలు, భగోజీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జానపద సంస్కృతిని ప్రతిబింబించే విధంగా పండుగను మరింత శోభాయమానం చేశారు.శీతలా భవాని పండుగ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా, వారి చరిత్ర, సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పెద్దలు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈ పండుగ బంజారా సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ వేడుక బంజారా సంస్కృతి వైభవాన్ని, వారి ఐక్యతను మరోసారి చాటిచెప్పే మహోత్సవంగా నిలిచింది. మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శీతలా భవాని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం

శాలిగౌరారం..ఆగస్టు 4 ప్రజా జ్యోతి:
శాలిగౌరారం మండలం మనమిద్దె గ్రామంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మనిమిద్దె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–18లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త బిక్షమమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ






సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువులకు కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. తల్లిపాలు ఉచితంగా లభించే అత్యుత్తమ ఆహారమని, బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి ఎంతో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, బాలురు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు. తల్లిపాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# భూతం బుచ్చయ్య మృతి పట్ల సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి సంతాపం

దేవరకొండ,గుడిపల్లి, ఆగస్టు 04,(ప్రజా జ్యోతి):
గుడిపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ సభ్యులు భూతం బుచ్చయ్య గారి అకాల మరణం పట్ల గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపం వ్యక్తం చేశారు.బుచ్చయ్య గారి అంతిమ యాత్రకు



సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించి, సజావుగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బుచ్చయ్య మృతి అత్యంత బాధాకరమని అన్నారు. మొదటి నుండి బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టం, అందించిన సేవలను ఎన్నటికీ మర్చిపోలేమని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వారాంతపు సంతను సద్వినియోగం చేసుకోవాలి

## ఏఎంసీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్

నడిగూడెం, ఆగస్టు 4: ప్రజా జ్యోతి:
నడిగూడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వారాంతపు సంతను కోదాడ ఏఎంసీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ వారాంతపు సంతతో పాటు మండలానికి కల్పించిన బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు అందించాలని వ్యాపారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు లింగయ్య, మనీషా, విజయ నాగరాజ్, రామకృష్ణ, సరస్వతి, రాము, సతీష్ కుమార్, శైలజ, మహేందర్, ప్రసాద్, మాధవి, గోపీనాథ్, మాజీ సర్పంచులు నాగలక్ష్మి –మల్లేష్ యాదవ్, సత్యనారాయణ, సుధాకర్, మాజీ ఎంపీటీసీ పందిరి వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్

మునుగోడు జులై 04 : ప్రజా జ్యోతి:
తల్లి పాల వారోత్సవాల్లో బాగంగా మునుగోడు గ్రామపంచాయతీ



పరిధిలో 1.2.3. అంగన్వాడి సెంటర్ లలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం హానికి సర్పంచ్ పాలకూరి రమాదేవి పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడారు.తల్లిపాల ప్రాముఖ్యత ముర్రుపాలు చిన్నపిల్లలకు పట్టించడం వల్ల పిల్లలు ఎంతో ఆరోగ్యకరంగా గాను .ముర్రుపాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది కావున బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని తల్లులందరికీ వివరించారు. చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు,వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు,చిన్నారుల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

★ వట్‌పల్లిలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ




**అందోల్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా వట్‌పల్లి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు మంగళవారం ఆర్థిక సహాయ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కష్టకాలంలో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ పాటిల్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఖాజా, రుక్మొద్దీన్, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, సర్పంచులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త

★ పోలీసులకు లొంగిపోయిన నిందితుడు





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 4:** నాగల్‌గిద్ద మండలంలోని ఇరక్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త ముల్తాన్ తన భార్య ఇర్ఫాన (32)ను ఇంటి నుంచి మౌలాలి దర్గా ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే వదిలివేసినట్లు సమాచారం. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిపి ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్య అనంతరం ఉదయం సుమారు 5 గంటల సమయంలో నిందితుడు నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తానే తన భార్యను హత్య చేసినట్లు పోలీసులకు తెలిపి లొంగిపోయాడు. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నాగల్‌గిద్ద ఏఎస్ఐ రవీందర్ తదితర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## గ్రామసభ నిర్వహణ - గ్రామాభివృద్ధిపై చర్చ



**రాయికోడ్ ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మాటూరు గ్రామంలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి,పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు.గ్రామ సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభిబాబీ, గ్రామపంచాయతీ కార్యదర్శి జావిద్ పాష, ఉప సర్పంచ్ నాగరాజ్,వార్డ్ సభ్యులు నర్సింలు పటేల్, నాగమ్మ, నరసింహులు పాల్గొన్నారు. అలాగే గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ మక్సూద్, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, అక్బర్ సాబ్, ముజీబ్ సాబ్, తిప్పరాజు, శివకుమార్, చంద్రయ్య, గ్రూప్ సభ్యులు జ్యోతి,లక్ష్మి, అంగన్వాడీ టీచర్ నిర్మలమ్మ, నరసమ్మ, అంజమ్మ,రోజమ్మ, సరూపమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. గ్రామ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తామని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.

## నీటి నిల్వతో దెబ్బతిన్న పత్తి పంటల పరిశీలన

★ పేనుబంక ఉధృతిపై రైతులకు అప్రమత్తం

★ శాస్త్రీయ యాజమాన్యంతోనే నష్టాల నివారణ: ఎంఏఓ వెంకటేశం





**కల్హేర్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి):** ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో కల్హేర్ మండలంలోని పలు గ్రామాల్లో నీటి నిల్వ కారణంగా దెబ్బతిన్న పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) శ్రీ వి. వెంకటేశం మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట పరిస్థితిని పరిశీలించిన అనంతరం రైతులకు పలు కీలక సూచనలు చేస్తూ, తక్షణమే నీటి నిల్వను తొలగించి శాస్త్రీయ పద్ధతుల్లో పంట సంరక్షణ చేపట్టాలని సూచించారు. పత్తి పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేయాలని, ఎక్కువసేపు నీరు నిల్వ ఉంటే మొక్కల వేర్లు కుళ్లిపోయి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఎంఏఓ తెలిపారు. పొలం ఆరిన తర్వాత తేలికపాటి అంతర దుక్కి నిర్వహించడం ద్వారా నేలలో గాలి ప్రసరణ మెరుగుపడి మొక్కలు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అవసరమైతే నత్రజని ఎరువులతో పాటు శిలీంధ్ర వ్యాధుల నివారణకు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం మండలంలోని పత్తి పంటలో పేనుబంక (అఫిడ్స్ ) ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రైతులు పొలాలను నిరంతరం పరిశీలించాలని ఆయన కోరారు. ఆర్థిక నష్టం స్థాయికి మించి పేనుబంక ఆశించినట్లయితే వ్యవసాయ శాఖ సూచించిన పురుగుమందులను మాత్రమే నిర్ణీత మోతాదులో పిచికారీ చేయాలని, విచక్షణారహితంగా రసాయనాల వినియోగం వల్ల సహజ శత్రు కీటకాలు నశించి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. లేడీ బర్డ్ బీటిల్స్ వంటి సహజ శత్రు కీటకాలను సంరక్షించడం ద్వారా పేనుబంకను సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు. పంటలో ఏవైనా చీడపీడలు లేదా వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించి సాంకేతిక సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ క్షేత్ర పరిశీలనలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీమతి కృష్ణవేణి, శ్రీ సాయిలు, శ్రీ నాగేందర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

### అందోల్ పోచమ్మ బోనాల్లో
## మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

★ భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి ప్రత్యేక పూజలు





**అందోల్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి):** అందోల్ గ్రామంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ వేడుకలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, లింగన్న, నారాయణ, లక్ష్మీకాంత్ రెడ్డి, విజయ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ నాగారత్నం గౌడ్, మాజీ కౌన్సిలర్ భవాని, సాయికుమార్, జిన్నా, విజయ్, ఇమ్రాన్, బలరాం, సోహెల్, నజీర్, జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



### అకాల వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోవడంతో
## బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 4** ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కురిసిన అకావర్షాలకు రెండు కుటుంబాల ఇళ్లు కూలిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన దూలం కిషన్--లక్ష్మి దంపతులు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న పాత ఇల్లు భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు నివాసం లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెంబడి సాయిబాబాకు చెందిన మరో ఇల్లు కూడా వర్షాలకు కూలిపోవడంతో ఆ కుటుంబం సైతం తలదాచుకునే చోటు లేక ఇబ్బందులు పడుతోంది. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ దర్శనం మోహన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయడంతో పాటు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు బాధిత కుటుంబాలను ఓదార్చి, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి తగిన సహాయ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

### రోడ్డుపై నాగలి పరికరాలతో
## ట్రాక్టర్లు నడపవద్దు: ఎస్సై సుమలత

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి )4. ఆగస్టు** ఇందల్వాయి మండల కేంద్రంలోని దొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రోహిత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. సుమలత మాట్లాడుతూ, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే ట్రాక్టర్లకు నాగలి, కల్టివేటర్ వంటి వ్యవసాయ పరికరాలను అమర్చుకుని రహదారులపై ప్రయాణించరాదని సూచించారు. ఇలాంటి పరికరాలతో రోడ్లపై ట్రాక్టర్లు నడపడం వల్ల ఇతర వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి నాగలి లేదా ఇతర వ్యవసాయ పరికరాలతో ట్రాక్టర్లను రహదారులపై నడిపినట్లయితే సంబంధిత ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై బి. సుమలత హెచ్చరించారు. గ్రామ ప్రజలు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు, వార్డు సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.



### ఇందల్వాయి మండలంలో
## ఎస్సై సుమలత అవగాహన కార్యక్రమం



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి). 4 ఆగస్టు** ఇందల్వాయి మండల కేంద్రంలోని దొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. సుమలత ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.రోడ్డుపైకి చిన్నారులను ఒంటరిగా పంపకూడదని, పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సూచనలు పాటించాలని ఆమె సూచించారు. అలాగే గ్రామంలో ఎవరైనా చిన్నారులను తీసుకెళ్లే ప్రయత్నం చేసినా లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రోహిత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పోలీసు శాఖ సూచనలను ఆసక్తిగా విన్నారు. గ్రామంలో ప్రజల భద్రత, చిన్నారుల రక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

### ప్రజాజ్యోతి ఎఫెక్ట్
## స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు



**దోంగ్లి ఆగస్టు 04 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా దోంగ్లి మండలం లింబూర్ గ్రామంలో గత కొంతకాలంగా హై మాక్స్ లైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలో నుండి బయటకు రావాలంటేనే కష్టంగా ఉందని గ్రామ ప్రజలు వాపోతున్నారు.నూతన సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలు కావస్తున్నాన మాత్రం హై మాక్స్ లైట్లు ఏర్పాటు చేయక పోవడం వల్ల గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేసిన హై మాక్స్ లైట్లు అక్కడక్కడ వెలుగుతున్నాయే తప్పా ఇంతవరకు కొత్తవి ఏర్పాటు చేయలేదని విమర్శించారు.రాత్రి సమయంలో ఇంట్లో నుండి బయటకు రావాలంటే తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు,గ్రామప్రజలు అధికారుల పై మండిపోతున్నారు,గ్రామాల్లో విష పురుగులు,వీధి కుక్కల సంచారం అధికంగా ఉండడంతో పొద్దుగూకితే ఇంట్లో నుంచి బయటకు రాలేకపోతున్నట్లు చెబుతున్నారు.ఎవరికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం ఆందోళన చెందుతున్నామన్నారు. అనే జూలై 26 గురువారం (ప్రజాజ్యోతి) దిన పత్రికలో వార్త రావడంతో గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం స్పందించి ,పోక్స్ లు కొత్తవి ఏర్పాటు చేశారు, ప్రజా సమస్యల ను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టి కి తీసుకువెళ్లి అధికారులు స్పందించేలా (ప్రజాజ్యోతి) దినపత్రిక కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాజ్యోతి ఎఫెక్ట్

### బోధన్ ఒకటో వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మీ రామ్మూర్తి గారి ఆధ్వర్యంలో
## డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ



**బోధన్ ( ప్రజా జ్యోతి). 4 ఆగస్టు** బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి గారి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళకు చీరల పంపిణీ ఈ కార్యక్రమానికి మహిళలు డ్వాక్రా సిబ్బంది సుజాత తులసి కళ్యాణి. ఈ చీరల పంపిణీ కార్యక్రమంలో వార్డు మహిళలు మరియు మాజీ సర్పంచ్ బంటు సాయిలు మా జి ఎంపీటీసీ సురేందర్ గౌడ్ తదితరులు ఈ చీరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కాలభైరవ స్వామి
## ఆలయంలో సింధూర పూజలు





**రామారెడ్డి ఆగస్టు 4 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ఈసన్నపల్లి- రామారెడ్డి గ్రామాలలో కొలువై ఉన్న దక్షిణ కాశీ గా పిలవబడుతున్న శ్రీ కాలభైరవ స్వామి వారికి మంగళవారం సందర్భంగా సింధూర పూజలు ఘనంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు మహా అన్నదాన ప్రసాదాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ప్రభు గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ, నాగరాజు, భరత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు విఆర్ఆర్ భరోసా



చిన్నకోడూరు, ఆగస్టు04, (ప్రజాజ్యోతి):- ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడటమే నిజమైన ప్రజాసేవ అని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల ఆయా కారణాలతో కొందరు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానంటూ భరోసా కల్పించారు. ఒక్కో కుటుంబానికి చొప్పున అరక్వింటాలు బియ్యాన్ని ఐదుగురు బాధిత కుటుంబాలకు అందించారు. వంగ వెంట కుండె తిరుపతి, కుంబాల చంద్రశేఖర్, బట్టు వంశీ, కోనేటి మహేష్ తదితరులున్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక



మిరుదొడ్డి, ఆగస్టు 4, (ప్రజా జ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ గ్రౌండ్‌లో నిర్వహించినట్లు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. భైరయ్య తెలిపారు. మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. ఎంపికైన జిల్లా జట్లు ఆగస్టు 7 నుంచి 9 వరకు వనపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నాయని తెలిపారు. పురుషుల జట్టు నుండి రవితేజ, చైతన్య, పరితోష్ కుమార్, కృష్ణ సాయి, భరత్ రాజ్, భార్గవ్, ఉదయ్ కుమార్, పవన్ కళ్యాణ్, శశాంక్ దేవ్, హర్షిత్, మహిళల జట్టు నుండి రాధిక, భవాని, గాయత్రి, శ్రీలక్ష్మి, సిరి, రాధిక ఎం, అనిత, సత్య, ఈక్షిత, శ్రీవైష్ణవి ఎంపికైన క్రీడాకారులందరికీ భైరయ్య అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి ఉమ్మడి మెదక్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# గుర్రాలగొందిలో డ్రై డే కార్యక్రమం



సిద్ధిపేట రూరల్, ఆగస్టు 04 ,(ప్రజాజ్యోతి): నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో డ్రై డే కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే పాత్రలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పనికిరాని వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించాలని సూచించారు. నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాన్ని వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న కోరారు.

# జైల్ భరోకు మద్దతుగా వినతిపత్రం




సిద్ధిపేట రూరల్, ఆగస్టు 04 ,(ప్రజాజ్యోతి): నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో ఆశ యూనియన్ తరఫున పాల్గొంటున్నట్లు హెచ్‌సీఓ సరస్వతి మేడంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు బిట్ల శ్రీలత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో ఆశ వర్కర్లు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశ వర్కర్లకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు బాలమణి, శోభ, జ్యోతి, సావిత్రి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలి



మిరుదొడ్డి, ఆగస్టు 4, (ప్రజా జ్యోతి): టిపిటిఎఫ్ మిరుదొడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సభ్యత్వ స్వీకరణ, ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, 2023 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏ. రామచంద్రం, డి. యాదగిరి, ర్యాకం మల్లేశం, గూడూరి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరు రైతులకు ఉద్యాన పంటల పై అవగాహన





ములుగు,ఆగస్టు4(ప్రజాజ్యోతి) ముల్కనూరు కూరగాయలు పండించే రైతులకు వాతావరణ అనుకూల సాగు సాంకేతికతలపై శిక్షణ కార్యక్రమాన్ని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్టికల్చర్ సైన్స్, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ముల్కనూరు సహకారంతో ముల్కనూరు ప్రాంత కూరగాయల రైతుల కోసం వాతావరణ మార్పులకు తట్టుకునే కూరగాయల సాగు సాంకేతికతలు అనే అంశంపై ఒక రోజు శిక్షణా,అవగాహన కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో నిర్వహించగా అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికథలు, నాణ్యమైన నారుమడి తయారు పద్ధతులు, కూరగాయల కోత అనంతరం నిర్వహణ తెగుళ్లు మరియు పురుగుల గుర్తింపు నివారణ చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఏలినినో ప్రభావంతో వాతావరణ అనుకూల కూరగాయల సాగు గురించి వెజిటేబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. నాణ్యమైన నార్మల్ తయారీ సాంకేతికతలు, కూరగాయల కోత అనంతరం నిర్వహణపై రైతులకు పీహెచ్డీ పరిశోధకులు నిరోషా, లావణ్యలు శిక్షణ ఇచ్చారు. కూరగాయల పంటలో పురుగుల వ్యాధుల నిర్ధారణ సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి డా,సురేష్ రైతులకు సూచించారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ దత్తత గ్రామమైన క్షీరసాగర్ లో సర్పంచ్ బాల్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్షేత్ర ప్రదర్శనకు తీసుకువెళ్లి వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా రైతులకు చూపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం ముల్కనూరు రైతులు వారికున్న సందేహాలను శాస్త్రవేత్తలతో చర్చించి నివృత్తి చేసుకున్న అనంతరం రైతులు ఈ కార్యక్రమం ద్వారా ఉపయోగకరమైన అంశాలను వివరించి మాకు సహకరించిన అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయమా..రాహుకాలమా..

● చిన్నకోడూరు ఇల్లంతకుంట రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో..?
● మూడేళ్లుగా గుంతల రహదారితో నిత్యం నరకయాతన







చిన్నకోడూరు, ఆగస్టు04, (ప్రజాజ్యోతి): చిన్నకోడూరు నుండి ఇల్లంతకుంట వెళ్ళే ప్రధాన రహదారికి రాజకీయ గ్రహణం పట్టిందో, లేక రాహుకాలం వదలడం లేదో తెలియదు గానీ దాదాపు మూడు సంవత్సరాలు గడిచినా రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. మండల కేంద్రం నుంచి ఇల్లంతకుంట వెళ్లే మార్గంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం పేరుతో పాత రహదారిని తవ్వి, నామ్‌కే వాస్తేగా మట్టి పోసి పనులను అర్ధాంతరంగా వదిలేయడంతో ప్రస్తుతం రహదారి గుంతలమయంగా మారింది. గజానికి పది గుంతలు ఉన్నాయనేలా పరిస్థితి ఉండగా, కొన్ని గుంతలు అరగజం లోతు వరకు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే రైతులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రహదారి దుస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల రహదారి ప్రజల ప్రాణాలకు యమపాశంలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేటకు ఉపాధి కోసం ప్రతిరోజూ వెళ్లే ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, సంపాదించిన డబ్బంతా వాహనాల మరమ్మతులకే ఖర్చవుతోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి చిన్నకోడూరు--ఇల్లంతకుంట రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుంతలను తప్పించబోయి వాహనదారులు ఎదురెదురుగా వచ్చే వాహనాలకు దగ్గరగా వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాదాల ముప్పు రోజు రోజుకు పెరుగుతోంది. ఇప్పటికే పలువురు స్వల్ప, తీవ్ర గాయాలకు గురైన ఘటనలు లేకపోలేదు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని చెప్పే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఈ రహదారి పై పలుమార్లు ప్రయాణించినా, ప్రజా సమస్యలు రోజు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నా సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి చిన్నకోడూరుఇల్లంతకుంట రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

# స్వచ్ఛ విద్యాలయ పురస్కారం

● ఉపాధ్యాయుల అంకిత భావానికి పట్టం ● ప్రధానోపాధ్యాయుడు రామస్వామికి సన్మానం



నంగునూరు, ఆగస్టు 4(ప్రజా జ్యోతి):- నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ విద్యాలయ పురస్కారం కోసం ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంగునూరు ఉన్నత పాఠశాలను సందర్శించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఈ అరుదైన గౌరవం పాఠశాలకు దక్కిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని అన్నారు. విద్యతో పాటు పరిశుభ్రత, క్రమశిక్షణ, విలువల బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే నంగునూరు పాఠశాలకు ఈ గౌరవం దక్కిందని పేర్కొన్నారు. ఈ పురస్కారం జిల్లాలోని ఇతర పాఠశాలలకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ మాట్లాడుతూ, ఈ అవార్డు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు అందరి సమిష్టి కృషికి దక్కిన గుర్తింపని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యా ప్రమాణాలతో పాటు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఆర్టీయూ టీఎస్ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొని ప్రధానోపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ పురస్కారం నంగునూరు మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఆర్ టి యు నంగునూరు శాఖ అధ్యక్షులు శ్రీ ఎర్ర పార్థసారథి గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్ర పార్థసారధి, రామస్వామి, ఒగులం రాజిరెడ్డి, భూపతి రెడ్డి, నరేశ్, కొత్తపల్లి రవి, జైపాల్ యాదవ్, సింగాబట్టు, రామరాజు,కోరే రాములు, మహేందర్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం చేయాలి



మిరుదొడ్డి, ఆగస్టు 4, (ప్రజాజ్యోతి): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మిరుదొడ్డిలో జరిగిన సీఐటీయూ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులను బలహీనపరిచారని, వ్యవసాయ రంగంలో దిగుమతులను ప్రోత్సహించడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాల్సిన సమయంలో కేంద్రం దాన్ని బలహీనపరిచే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు దారితీసే విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మద్దెల అంజయ్యతో పాటు బాలమణి, కవిత, విజయ, మాలతి, శమీమ్, నక్క ఎల్లవ్వ, గాలవ్వ, పోదేటి రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యంగా ఉండండి అండగా ఉంటా

● బాధిత కుటుంబాలకు వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శ





సిద్దిపేటఅర్బన్, ఆగస్టు4 (ప్రజాజ్యోతి):- కుటుంబ సభ్యులను కోల్పోయిన క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు కు చెందిన రొంప పర్శయ్య బొగ్గులోని బండకు చెందిన బైరి చార్లెస్ ల కుటుంబాలను మంగళవారం పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న వారికి భరోసానిస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అధైర్య పడవద్దని వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరో విజయవంతం చేయాలి



కొండపాక, ఆగస్టు 4:( ప్రజా జ్యోతి):- క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10న నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, మేధావులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ ఉమ్మడి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు జైల్ భరో కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సవరణ బిల్లు--2025, కార్మిక చట్టాల మార్పులు, 'హైర్ అండ్ ఫైర్' విధానం, పని గంటల పెంపు, సమ్మె హక్కుపై ఆంక్షలు వంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు జీఓ 51లో సవరణలు చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, వారసత్వ ఉద్యోగాలు తదితర సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, హమాలి, భవన నిర్మాణ కార్మికులు, ఐకేపీ వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య శాఖ స్కీమ్ వర్కర్లు తదితరులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు జాలిగామ ప్రభాకర్, ఆరుట్ల నర్సింలు, తలారి ఐలయ్య, దాసరి రాజు, కొమ్ము నర్సింలు, తలపాక లక్ష్మి, దున్న మణెమ్మ, పిల్లి లచ్చవ్వ, భాగయ్య, మల్లేశం, రమేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలకు మేకలకు బ్లూ టంగ్ టీకాలు వేయించాలి

– పశువైద్యాధికారి పరశురాం



దౌల్తాబాద్, ఆగస్టు 04 (ప్రజాజ్యోతి) గొర్రెలకు మేకలకు బ్లూ టంగ్ టీకాలు తప్పకుండా వేయించాలని పశు వైద్యాధికారి పరశురామన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గొర్రెలకు మేకలకు బ్లూ టంగ్ టీకాలు వేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లూ టంగ్ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా అందరూ బ్లూ టంగ్ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అనురాధ రమేష్, ఉప సర్పంచి ఆది బాలకృష్ణ , పశు వైద్య సిబ్బంది సుధార్శన్ వి ఐ ఓ శామయ్య, హెచ్ ఏ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో తల్లిపాల వారోత్సవాలు





మిరుదొడ్డి, ఆగస్టు 4, (ప్రజా జ్యోతి): మిరుదొడ్డి మండల కేంద్రంలోని నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ గిరిజ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన మొదటి గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ముర్రుపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని అందిస్తాయని వివరించారు. రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ నర్సింలు, వార్డు సభ్యులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లు పున్నమ్మ, ప్రేమలత, రేణుక, రేణమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన కౌన్సిలర్ సమీనా మీర్ తాహెర్ అలీ

- కాలని వాసుల విజ్ఞప్తికి వెంటనే స్పందన
- మొరం వేసి ట్రాక్టర్ డోజర్‌తో రోడ్డు మరమ్మత్తు





**పరిగి, ఆగస్టు 04 (ప్రజాజ్యోతి):** పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఎస్‌వి ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గుంతలతో ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కౌన్సిలర్ సమీనా మీర్ తాహెర్ అలీకి తెలుపుగా కౌన్సిలర్ మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బంది సహాయంతో రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. వర్షపు నీరు రోడ్డులోని గుంతల్లో నిల్వ ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండగా, సమస్యను గుర్తించిన కౌన్సిలర్ మొరం వేయించి ట్రాక్టర్ డోజర్ సహాయంతో రహదారిని మరమ్మత్తు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సమీనా మీర్ తాహెర్ అలీ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, 13వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కే మల్లేష్, వైస్ చైర్మన్ హన్మంతు, కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బధ్యా నాయక్ తండాలో తల్లిపాల వారోత్సవ వేడుకలు...



**దోమ ఆగస్టు 04 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని బధ్యా నాయక్ తండా లో మంగళవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ నర్సమ్మ మాట్లాడుతూ.. తల్లిపాలు పకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. ప్రసవం జరిగిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని ముర్రుపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తాయని వివరించారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ నర్సమ్మ, అంగన్వాడీ టీచర్ దేవి అంగన్వాడి టీచర్స్ ,గర్భిణీలు,బాలింతలు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు వ్యసన నిర్మూలనకు అందరూ కృషి చేయాలి : మిరియాల ప్రీతమ్



**శేరిలింగంపల్లి,ఆగస్టు 04 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మదినగూడ డివిజన్ హుడా కాలనీ పరిధిలో నషా ముక్త్ భారత్ అభియాన్ మిషన్ స్పందన్ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వహించిన 10 కోట్ల మంది మత్తు వ్యసన రహిత ప్రతిజ్ఞ మహా ప్రచారం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్,రఘునందన్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ పాల్గొని మత్తు వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. సమాజంలో మత్తు వ్యసనాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బ్రహ్మకుమారీస్ సంస్థ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అధికారులు, సామాజిక కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సౌందర్య రాజన్ శ్రీహరి,చంద్ర శేఖర్,మస్తాన్ రెడ్డి మోసిన్ నారాయణరెడ్డి శేఖర్ త్రిలోచన్ కార్యకర్తలు పాల్గొని మత్తు వ్యసన నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు.

## భాగ్యనగర్ కాలనీలో జలదిగ్బంధం

- ఇళ్లలోకి వర్షపు నీరు.. పాములు, తేళ్లతో కాలనీవాసుల భయాందోళన



**షాద్‌నగర్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి) :**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో షాద్‌నగర్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ, కీర్తి అపార్ట్‌మెంట్ వెనుక ఉన్న ప్రాంతంలో జలదిగ్బంధం ఏర్పడింది. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇళ్లలోకి నీరు చేరడంతో పాటు పాములు, తేళ్లు, ఇతర విషజంతువులు ప్రవేశిస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయంతో కాలం గడుపుతున్నారు. ఇంట్లోని సామగ్రి నీటిలో తడిసి ఆర్థిక నష్టం వాటిల్లుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

తీవ్ర ఇబ్బందుల కారణంగా కొందరు కుటుంబాలు తమ ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాల్లో అద్దె ఇళ్లకు వెళ్లి నివసిస్తున్నట్లు తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

కమిషనర్ స్వయంగా కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి జలదిగ్బంధానికి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత పునరుద్ధరించాలి

పరిగిలో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ





- బహర్‌పేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన నాయకులు - ప్రభుత్వం తీరుపై ఆగ్రహం

**పరిగి, ఆగస్టు 04 (ప్రజాజ్యోతి):** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను తొలగించడాన్ని నిరసిస్తూ పరిగి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. బహర్‌పేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అట్టడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం గొంతుకగా నిలుస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని అన్నారు. వెంటనే ఆయనకు భద్రతను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పరిగి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, విజయ్ ఆర్య, కౌన్సిలర్లు జాక్ రవికుమార్, మీది గడ్డ శ్రీనివాస్, తాహెర్ అలీ, ఆనెం ఆంజనేయులు, మంచన్‌పల్లి ఆనంద్, సేవియా నాయక్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## యువకులకు, చిన్నారులకు, ప్రజలకు సురక్షిత ప్రయాణమే లక్ష్యం

- మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి - మక్తగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దగుట్ట తాండలో ఐమాక్స్ లైట్స్ ప్రారంభించిన
- మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి - మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తా





**కొత్తూర్ ఆగస్టు 04 (ప్రజా జ్యోతి) :**

యువకులకు, చిన్నారులకు, ప్రజలు, వాహనదారులకు సురక్షిత ప్రయాణమే లక్ష్యమని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దగుట్ట తాండలో ఉప సర్పంచ్ రాములు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు, వాహనదారులు రాత్రి సమయాల్లో సురక్షితంగా రాకపోకలు సాగించాలని ఉద్దేశంతోనే ఈ ఐమాక్స్ లైటింగ్ ను ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బోకుల శ్రీరాములు,చిట్టెడి నరసింహారెడ్డి,మీనాక్షి దశరత్ నాయక్, మాజీ సర్పంచులు రాందాస్ నాయక్, కట్న రాజు, రవి నాయక్, సీనియర్ నాయకులు గోపాల్ నాయక్, రాజు గౌడ్, వార్డు సభ్యులు బోకుల రాజు, చందర్ నాయక్, రాందాస్ నాయక్, కాట్నా శ్రీను, శివలింగం, కృష్ణ, గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరిగడ్డలో పంచాయతీ భవన నిర్మాణ స్లాబ్ పనులకు శ్రీకారం



సర్పంచ్ చందు నాయక్ ప్రారంభం..
గ్రామాభివృద్ధికి కృషి కొనసాగుతుందని వెల్లడి

**ఫరూక్‌నగర్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి) :** ఫరూక్‌నగర్ మండలంలోని ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణంలో భాగంగా స్లాబ్ పనులను మంగళవారం సర్పంచ్ చందు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని నూతన పంచాయతీ భవనం నిర్మాణంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందు నాయక్ మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో పాలకవర్గం ప్రజలకు సేవలు అందించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నూతన పంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటు లోకి తీసుకు వస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేం దుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీలత తిరుపత య్యతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మార్వాడి సంఘ్ కావడి యాత్ర

- రామ్ మందిర్ నుంచి రామేశ్వరం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు కాలినడకన పాదయాత్ర



**షాద్‌నగర్, ఆగస్టు 4 (ప్రజాజ్యోతి) :** పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ మార్వాడి సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం సంప్రదాయబద్ధంగా కావడి యాత్రను ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ రామ్ మందిర్ నుంచి పవిత్ర జలాలను కావడిలో మోసుకుంటూ భక్తులు కాలినడకన రామేశ్వరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి చేరుకుని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.

వ్యాపారాభివృద్ధి, కుటుంబ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన భక్తులు శివనామస్మరణతో యాత్రను కొనసాగించారు. మహిళలు, పురుషులు, చిన్నారులు, వృద్ధులు అనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. కాషాయ వస్త్రాలు ధరించి, పాదరక్షలు లేకుండా కావడిని గమ్యస్థానానికి చేరుకునే వరకు కింద పెట్టకుండా మోసుకెళ్లడం ఈ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

యాత్రలో భాగంగా చౌదమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు రామేశ్వరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి పాదయాత్రగా చేరుకుని పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. శ్రావణమాసంలో కావడి యాత్ర చేయడం ద్వారా పరమశివుని అనుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మార్వాడి సంఘ్ సభ్యులను అభినందించారు.

కావడి యాత్రలో పార్వతీ--పరమేశ్వరుల వేషధారణలో కళాకారుల ప్రదర్శనలు, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మార్వాడి సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.

## కొత్తూరు సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి





**కొత్తూర్ ఆగస్టు 04 (ప్రజా జ్యోతి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు నూతన సీఐ నాగార్జున రెడ్డిని మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి కలిసి బహుమతి అందజేసే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..గ్రామ ములో అందరు కలిసిమెలిసి ఉండాలని,శాంతిభద్రతలకు అందరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు,ఆన్‌లైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని ఎవ్వరైనా అనుమాస్పదంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని సీఐ నాగార్జున రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి,స్వాతి రాజేష్,రవీందర్ రెడ్డి,పాపి రెడ్డి,దామోదర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,అరుణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ-ప్రైమరీ సిబ్బంది నియామకం

- ఇప్పటికే తరగతులు ప్రారంభం
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాభ్యా నాయక్
- గ్రామ సర్పంచ్ ఎస్. పండరి



**తాండూరు, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీ-ప్రైమరీ విద్యా విధానం కార్యక్రమంలో భాగంగా ప్రీ-ప్రైమరీ సిబ్బందిని మంగళవారం రోజు నియమించిన్నట్లు చెప్పారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎస్. పండరి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు బాభ్యా నాయక్ ప్రి ప్రైమరి సిబ్బందికి నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను పాఠశాలలో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీశ్ గౌడ్, స్థానికులు పండరి చారి, మోహినోదీన్,పాఠశాల ఉపాధ్యాయులు అంజమ్మ, పరమేశ్వరి, చంద్రకాంత్, యూసుఫ్, భరత్ కుమార్, గంగాధర్,పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తల్లిపాలలో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుంది

- అంగన్వాడీ టీచర్ అనసుజా



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) ఆగస్టు 04 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని మందిపాల్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం రోజు ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ అనసూజా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అనసూజా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువుకు తల్లి ముర్రుపాలు పట్టించడం ఎంతో ప్రాముఖ్యమని,ఆ ముర్రుపాలు తాగిన శిశువుల లోపల వ్యాధి నిరోధక శక్తి సమృద్ధిగా లభిస్తుందని అన్నారు. ప్రసవించిన మహిళలు కూడా ఆకుకూరలు,పప్పు దినుసులు,విటమిన్లు,ఖనిజాలు లభించే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల పాలు సమృద్ధిగా నవజాత శిశువులకు అందుతాయని బాలింతలకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

అడ్డుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



**తాండూరు ఆగస్టు 4 ప్రజా జ్యోతి :** తాండూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకొని అట్టి భూములను కాపాడాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డిని కలిసిన కౌన్సిలర్ ఇర్షత్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ పట్టణంలోని సర్వే నెం. 135లో గల ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా రెవిన్యూ అధికారులు నిర్ధారించిన విధంగా తాండూర్ పట్టణంలోని సర్వే నెం.135లో ప్రభుత్వ భూమి అని అప్పట్లో అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా గతంలో సర్వే నెం. 111లో వివాదాస్పదంగ ఉన్న భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇప్పుడు ఎందుకు సైలెంట్ గా ఉన్నారని ప్రశ్నించారు. సర్వే నెం. 135లోని ప్రభుత్వ భూమిలో కూడా నిర్మాణాలు చేపడుతున్నా రనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తు న్నాయి. ఇలా పునాది దశలోనే మున్సిపల్ అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించి, ప్రభుత్వ భూమిలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తేలితే వాటిని వెంటనే నిలిపివేసి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత కాదా అని గుర్తు చేశారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కమిషనర్ను కలిసిన వారిలో కౌన్సిలర్ యోగ నందు,సంతోష్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## నూతన కలెక్టరేట్ ఆర్చి ఆకర్షణీయంగా నిర్మించాలి

### ప్రధాన గేటు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 4 (ప్రజాజ్యోతి ):
నూతన కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్చి ఆకర్షణీయంగా, నాణ్యతతో, జిల్లాకు గుర్తింపుగా ఉండేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం నూతన కలెక్టరేట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్చి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్చి నుంచి ప్రధాన



రహదారి వరకు ఉన్న పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధాన గేటు నిర్మాణంతో పాటు రహదారి, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నిర్మాణ పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే విధంగా ఆర్చి నిర్మాణం ఉండాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను సమన్వయంతో నిర్వహిస్తూ కలెక్టరేట్ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తో ఆవు మృతి

మేడిపల్లి ఆగస్టు 4 ప్రజా జ్యోతి:
మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి గ్రామంలో లింగాల ప్రకాష్ అనే రైతు ఆవు మంగళవారం రోజు గడ్డి మేస్తూ ట్రాన్స్ఫారం వైరు తగిలి విద్యుత్ షాక్ తో చనిపోయింది.



జీవనాధారమైన 80000 రూపాయల విలువగల ఆవు చనిపోవడంతో రైతు తన ఆవేద న వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫారం చుట్టూ రక్షణ కవచంగా కంచి వేయాలని, మూగజీవులకు రక్షణ కలిగించాలని, వెంటనే ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం రైతుకు అందించి ఆదుకోవాలని, గ్రామస్తులు రైతులు కోరుచున్నాను.

## గుల్లకోటలో మండల స్థాయి సమీక్ష సమావేశం

### కొందరు అధికారుల తీరుపై మండి పడ్డ సర్పంచ్ లు

ఎండపల్లి, ఆగస్టు 4, ప్రజాజ్యోతి:
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించారు. గుల్లకోట రైతు వేదికలో ప్రత్యేక అధికారి సమక్షంలో మండల అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఎం రవి ప్రసాద్ డి ఎఫ్ ఓ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులు, వాటి



పురోగతి, అంశాలపై అధికారులు వివరాలు వెల్లడించారు , ఈ సందర్భంగా వెంటనే పలు గ్రామాల సర్పంచులు స్పందిస్తూ, పలు గ్రామాల సమస్యలను అధికార దృష్టికి తీసుకువస్తూ, ముఖ్యంగా పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న విద్యుత్, అధికారిపై,అలాగే కొన్ని శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ,.ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని సూచించారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
మండల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో సూచించారు. పెండింగ్ పనులను గుర్తించి వాటి పూర్తికి కార్యాచరణ రూపొందించాలని, సూచించారు ,ఈ సమావేశంలో ఎంపీడీఓ కృపాకర్ తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,తో పాటు మండలస్థాయి అధికారులు,మండలంలోని సర్పంచ్ లు,వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు,

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

### మండల బిజెపి అధ్యక్షుడు మొగిలి మహేష్

చొప్పదండి, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):
విద్యార్థుల కోసం ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందించడానికి తమ పార్టీ ముందుంటుందని చొప్పదండి మండల బిజెపి అధ్యక్షుడు మొగిలి మహేష్ అన్నారు. ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్ లో మాజీ ఎంపీటీసీ గొల్ల సునంద గట్టయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొగిలి మహేష్ మాట్లాడుతూ పాఠశాల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల బిజెపి మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి భూమిరెడ్డి, స్థానిక బూత్ అధ్యక్షుడు దామెర మధుసూదన్ రెడ్డి, చీకట్ల శ్రీకాంత్, తాళ్లపల్లి రవి, చాతర్ల శ్రీనివాస్, పాలోజీ వెంకటరమణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# పచ్చని ముసుగులో పొంచివున్న ముప్పు

### ‘కోనో కార్పస్’ చెట్లతో పర్యావరణానికి, ఆరోగ్యానికి తీవ్ర నష్టం

మల్యాల, ఆగస్ట్ 04 , ప్రజాజ్యోతి :
రహదారిలో పక్కన పచ్చదనానికో నగరాల అందాన్ని పెంచడానికో, లేక క్షణాల్లో పచ్చదనాన్ని నింపడానికో మనం చేసే కొన్ని ప్రయోగాలు ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుంటాయి. అలాంటి ఒక ప్రమాదకరమైన పచ్చని ముప్పే ‘కోనో కార్పస్’ రోడ్ల డివైడర్లు, పార్కులు, ఇళ్ల ముందర ఎటు చూసినా దట్టంగా, ఎల్లప్పుడూ పచ్చగా కనిపించే ఈ విదేశీ మొక్కలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి పెద్ద శాపంగా మారాయి. వీటి తీవ్రతను గుర్తించిన గుజరాత్, తెలంగాణ వంటి పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఈ చెట్ల పెంపకంపై నిషేధం విధించాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాంటి మొక్కను నాటి పెంపు చేసి మండల ప్రజల ఆరోగ్యాలతో అధికారులు ఆటలాడుతున్నారని ప్రజలు వాపోతున్నారు . గతంలో కొనో కార్పస్ చెట్లను నరికి వేసిన పూర్తి స్థాయిలో వాటిని నరికి వేయడంలో అధికారులు విఫలమైనట్లే చెప్పవచ్చు. మల్యాల సాయిబాబా గుడి నుండి మొదలుకొని రహదారి ఇరువైపులా తాటి పెల్లి గురుకుల పాఠశాల వరకు దట్టంగా పెరిగిన కోనో కార్పస్ చెట్ల వల్ల అటుగా ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ చెట్ల యొక్క కాయలు పక్వానికి వచ్చి ఆ కాయల నుండి దూది లాంటి పదార్థం వాహనదారుల కంట్లో ముక్కులో దూరడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అసలు ఏమిటీ కోనో కార్పస్?:**

ఇది అమెరికా, ఆఫ్రికా ఖండాలలోని తీరప్రాంతాలకు చెందిన ఒక రకమైన విదేశీ మొక్క. అతి తక్కువ కాలంలో, ఎలాంటి వాతావరణంలోనైనా, చాలా వేగంగా పెరగడం దీని ప్రత్యేకత. అందుకే కొన్నేళ్ల క్రితం హరితహారంలో భాగంగా, నగరాల సుందరీకరణ కోసం ఈ మొక్కలను విస్తృతంగా నాటారు. కానీ, ఈ పచ్చదనం వెనుక దాగున్న



చేదు నిజాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

**కోనో కార్పస్ వల్ల కలిగే ప్రధాన నష్టాలు:**

మానవ ఆరోగ్యానికి తీవ్ర ముప్పు (శ్వాసకోశ సమస్యలు) ఈ చెట్లు శీతాకాలంలో, వసంతకాలంలో విపరీతంగా పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ పుప్పొడి గాలిలో కలిసిపోవడం వల్ల ప్రజల్లో అలర్జీలు, తీవ్రమైన దగ్గు, జలుబు మరియు ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది.
కోనో కార్పస్ చెట్ల వేర్లు భూమిలోకి చాలా లోతుగా, బలంగా దూసుకుపోతాయి. ఇవి భూమిలోని తేమను, భూగర్భ జలాలను పీల్చేస్తాయి. దీనివల్ల చుట్టుపక్కల ఉన్న ఇతర దేశీయ మొక్కలకు నీరు అందక అవి ఎండిపోతాయి. ఇవి ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం దారుణంగా పడిపోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.ఈ చెట్ల వేర్ల వ్యవస్థ చాలా దూకుడుగా ఉంటుంది. ఇవి భూగర్భంలో ఉండే మంచినీటి పైపులైన్లు, డ్రైనేజీ వ్యవస్థలను ముక్కలు చేస్తాయి. ఇళ్ల గోడలు, కాంపౌండ్ వాల్స్, రోడ్ల కిందకు దూసుకువెళ్లి పగుళ్లు వచ్చేలా చేస్తాయి. దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ఇది మన దేశీయ మొక్క కాదు కాబట్టి, మన స్థానిక పక్షులు గానీ, సీతాకోకచిలుకలు గానీ దీనిపై వాలవు. కనీసం గూళ్లు కూడా పెట్టవు. ఈ చెట్టు ఆకులను పశువులు కూడా తినవు. జీవవైవిధ్యం పరంగా దీనివల్ల ఎలాంటి ఉపయోగం లేదు సరిగదా, స్థానిక వృక్షజాతులను ఇది నాశనం చేస్తుంది.

**ప్రభుత్వాల మేల్కొలుపు.. నిషేధాల పర్వం:**

కోనో కార్పస్ వల్ల జరుగుతున్న నష్టాన్ని గుర్తించిన గుజరాత్ ప్రభుత్వం గతంలోనే అటవీ ప్రాంతాల్లో, నగరాల్లో దీని పెంపకాన్ని పూర్తిగా నిషేధించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని పలు పురపాలక సంఘాలు కూడా ఈ మొక్కలను నాటడం ఆపేయడమే కాకుండా, ఉన్నవాటిని తొలగించి వాటి స్థానంలో వేప, రావి, కానుగ వంటి స్వదేశీ మొక్కలను నాటాలని నిర్ణయించాయి. ప్రభుత్వ ఆదేశానుసారంగా మల్యాల నుండి తాటి పెల్లి గ్రామం వైపు గల కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించి వాటి స్థానంలో స్వదేశీ మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా మారదాం.. స్వదేశీ మొక్కలను నాటుదాం అన్న నినాదాన్ని తెరపైకి తీసుకువచ్చాయి. చూడటానికి అందంగా ఉందనో, త్వరగా పెరుగుతుందనో కోనో కార్పస్ లాంటి విదేశీ మొక్కలను తెచ్చి మన చేతులతో మన పర్యావరణాన్ని నాశనం చేసుకోవద్దని వృక్షశాస్త్రజ్ఞులు నెత్తీనోరూ బాదుకుంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థలు, నర్సరీలు,



మరియు సామాన్య ప్రజలు ఈ చెట్ల పట్ల అప్రమత్తం కావాలి.
మన మట్టికి అలవాటైన, మనకు ప్రాణవాయువును ఇచ్చే వేప, కానుగ, పొగడ, మర్రి, నేరేడు వంటి సాంప్రదాయ మొక్కలను నాటడమే మనకు, మన కాబోయే తరాలకు శ్రీరామరక్ష. పచ్చదనం అంటే కేవలం రంగు కాదు... అది మన ప్రాణవాయువు కావాలి, ప్రాణసంకటం కాకూడదని పర్యావరణవేతలు సూచిస్తున్నారు.

# ఫస్ట్ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

### అత్యధిక బంగారు పతకాలతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 4 (ప్రజాజ్యోతి ):
కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఇటీవల



నిర్వహించిన 1వ ఫస్ట్ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అత్యధిక బంగారు పతకాలు సాధించారు. బంగారు పతక విజేతలు ఈ నెల 7న హన్మకొండలోని జె.ఎన్. స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అథ్లెటిక్స్ అన్ని క్రీడలకు మూలాధారమని అన్నారు. ప్రతి క్రీడాకారునిలో వేగం, బలం, ఓర్పు, చురుకుదనం పెంపొందించడంలో అథ్లెటిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పరుగు, జంప్స్, త్రోస్ వంటి విభాగాల ద్వారా విద్యార్థుల సహజ ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు.
అథ్లెటిక్స్ పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని అలవర్చుతాయని చెప్పారు.
పాఠశాల స్థాయి నుంచే అథ్లెటిక్స్‌కు ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని ఆయన అన్నారు.పోటీల్లో ఓ. ఆశ్రిత (4వ తరగతి) అండర్-10 విభాగంలో 60 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించింది. ఆరుష్ (7వ తరగతి) అండర్-12 స్టాండింగ్ లాంగ్ జంప్‌లో బంగారు పతకంతో పాటు 1 కేజీ షాట్‌పుట్, బ్యాక్ త్రోలో రజత పతకాలు గెలుచుకున్నాడు.
ఫైజాన్ (5వ తరగతి) అండర్-12 విభాగంలో 60 మీటర్లు, 400 మీటర్ల పరుగుల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు.అలాగే సాకీబ్ (8వ తరగతి) అండర్-14 కిడ్ జావెలిన్ త్రోలో రజత పతకం, మాన్విత (4వ తరగతి) స్టాండింగ్ లాంగ్ జంప్‌లో రజతం, 60 మీటర్ల పరుగులో కాంస్య పతకం, సిద్ధాంత్ (7వ తరగతి) స్టాండింగ్ లాంగ్ జంప్‌లో రజత పతకం, ప్రణ్య (4వ తరగతి) 300 మీటర్ల పరుగులో కాంస్య పతకం, హ్రిధన్ (3వ తరగతి) అండర్-8 విభాగంలో 150 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు.రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ విజయాల దిశగా తీర్చిదిద్దుతున్నామని డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు.అనంతరం విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏటీసీల తో ఉపాధి అవకాశాలు మెరుగు

### యువతకు ఆధునిక శిక్షణ అందిస్తాం

### విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ట్రైనింగ్ ఇప్పిస్తాం

### మంత్రివివేక్,వెంకటస్వామి


వేములవాడ, ఆగష్టు4, ప్రజాజ్యోతి:
అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.
అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డైరెక్టర్ ఉపాధి కల్పన అండ్ శిక్షణ శాఖ ఐఏఎస్ ఏ నిర్మల క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ వినిపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన పెన్షన్లకు సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో రూ. 4000 వేల కోట్లతో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఐటీఐలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరిస్తోందన్నారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని తెలిపారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని విదేశీ భాషల శిక్షణ అందిస్తున్నామని, రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగ పడే విధంగా ఏటీసీల్లో



నూతన కోర్సులు ప్రవేశ పెడతామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఎస్పీలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుద్రంగిలో 1986లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై విద్యాభివృద్ధికి దోహదపడిందన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.
స్కూల్ లో 2500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వివరించారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నామని తెలిపారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ రోడ్లు అభివృద్ధి చేయిస్తున్నామని, విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయించామని వివరించారు. త్వరలో హ్యామ్ ద్వారా వివిధ రోడ్లు అభివృద్ధి చేస్తామని తెలిపారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు కోసం రూ.45 కోట్ల భూసేకరణ చేపట్టామని తెలిపారు. ఆయా పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ఆలయ విస్తీర్ణం పెరుగుతుందని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేములవాడ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, మూలవాగుపై రెండో వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం పక్కగా అమలు చేస్తోందన్నారు.
రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులు ఏడు కోర్సుల్లో శిక్షణ పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మర్రిపల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం, ఆధునిక గోశాల కోసం చెరో 40 ఎకరాలు కేటాయించినట్లు వెల్లడించారు. పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఏటీసీల ద్వారా ప్రస్తుత పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇస్తారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ప్రత్యేక చొరవతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని వివరించారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్ అవసరమైన కోర్సులు రూపొందించారని తెలిపారు. ఏటీసీల్లో ఏడు కోర్సులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఇతర ఆధునిక కోర్సులలో శిక్షణ అందించి.. ఉపాధి అవకాశాలు కూడా వస్తాయని తెలిపారు. నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఏటీసీ కేంద్రం ఈ ప్రాంతం వారికి చాలా కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల

గంభీరావుపేట ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):
గంభీరావుపేటమండలంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి అభినయ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో అభినవ్ గారు తల్లులను ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని ఆరు నెలల వరకు కేవలము తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని పుట్టిన వెంటనే తల్లి పాలు త్రాగడం వలన తల్లికి కూడా చాలా లాభాలు ఉన్నాయని రొమ్ము క్యాన్సర్ గర్భసయ్య క్యాన్సర్ ఒబిసిటీ లాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తల్లి పాలు



ఇవ్వడం వలన గర్భాశయం తొందరగా యధాస్థానంలోకి వస్తుందని ఈ విషయాన్ని గ్రామాలలోని తల్లులందరికి అర్థమయ్యేలాగా అవగాహన కల్పించాలని తెలియజేయడం జరిగింది కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి మరియు స్వరూప గారలు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు పాలు పట్టడం వలన తల్లి బిడ్డలకు ఇద్దరికీ కూడా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా రాకుండా ఉంటారని బిడ్డలో తల్లి పాలు తాగడం వలన సంపూర్ణంగా ఎదుగుదల ఉంటుందని తల్లి బిడ్డల మధ్యలో అనుబంధం పెరుగుతుందని తల్లిపాలు తాగిన పిల్లల్లో ఎక్కువ తెలివితేటలు ఉంటాయని డబ్బా పాల వలన బిడ్డ అనారోగ్యానికి గురి అవుతాడని వాంతులు విరోచనాలు వంటి రోగాల బారిన పడడం వలన పోషణ స్థామత్యాన్ని కోల్పోతారని తెలియజేశారు.కార్యక్రమంలో డాక్టర్ అభినయ్ , సి హెచ్ ఓ రవీందర్ ఐసిడిఎస్ సూపర్ లు జి. కళావతి డి స్వరూప పి హెచ్ ఎం విజయ, హెల్త్ సూపర్వైజర్ సీతా మహాలక్ష్మి , ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు మరియు తల్లులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై
# ముదిగొండ పిఎస్‌లో కేసు నమోదు

★ రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ




**ముదిగొండ ఆగస్టు 4(ప్రజా జ్యోతి)** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగం నోటిఫికేషన్ ఇవ్వడం లేదని మనస్థాపానికి గురైన మండలం పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణు కుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ముదిగొండ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుని ముదిగొండ హెడ్ కానిస్టేబుల్ పి వెంకటేశ్వర్లు స్వీకరించారు. తక్షణమే ప్రభుత్వం వేణు కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి పక్కా ఇల్లు కేటాయించాలని రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ముదిగొండ మండలం మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్ మాజీ రైతుమండల కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్ సీనియర్ నాయకులు బం కా మల్లయ్య బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షులు తోట ధర్మారావు తెలంగాణ ఉద్యమకారుడు పొనుగుల కోటేష్ యాదవ్ మైనార్టీ సెల్ మండల మాజీ అధ్యక్షులు షేక్ కాజా ముదిగొండ గ్రామ నాయకులు కొమ్మూరి రమేష్, హాఫీజ్ ఎండి ఖాసీం బాబు, కే నాగార్జున, యం సంజీవరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

# తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

★ ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**సత్తుపల్లి ఆగస్టు04(ప్రజా జ్యోతి)** నవజాత శిశువుకు సరైన ఆహారం అందించి, అభివృద్ధి చెందేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో అంగన్వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. సత్తుపల్లి పట్టణంలోని అంగన్వాడి 5, 6,10, రామనగరం అంగన్వాడి సెంటర్లలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని సూపర్వైజర్ మహాలక్ష్మి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినారు. అంగన్వాడీ టీచర్లు తల్లిపాల వారోత్సవాల ఫ్లెక్సీలతో ర్యాలీ తీసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏ.ఎన్.ఎం ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థులు హాజరైనారు. ఈ సందర్భంగా ఫ్లాగ్ కార్డులతో, చార్ట్ లతో, తల్లిపాలు ప్రాముఖ్యత, వాటి విలువ, గర్భిణీ స్త్రీల తీసుకునే ఆహారం, వారు చేయవలసిన యోగాసనాలు వంటి కార్యక్రమాలను గర్భిణీలకు తల్లులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ







సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలతో సమానమైన ఆహారం ఎక్కడా దొరకదు కాబట్టి ,శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని, పుట్టిన శిశువుకు ముర్రుపాలు ఎంతో ఉపయోగకరమని,వాటి వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, శిశువు అభివృద్ధి చెందటానికి దోహద పడుతుందని, గర్భిణీ దగ్గర నుంచి పిల్లల వరకు తల్లులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పౌష్టికాహారం ఎలా తీసుకోవాలి, అనే విషయాలపై తెలియజేశారు. అంగన్వాడి సెంటర్ 5 నుండి పలువురు చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించి నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు త్రివేణి, అరుణ, రమాదేవి ,రామ్ తున్నీసా, స్వాతి ,భారతి ,సుజాత, సర్వేశ్వరి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తలసేమియా బాధితులకు 'రితన్య హాస్పిటల్' అండ

★ రక్తదాతలు, ప్రభుత్వం స్పందించాలని డాక్టర్ నారాయణమూర్తి విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రితన్య హాస్పిటల్ నిరంతర సేవలు అందిస్తోంది.ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నారాయణమూర్తి (ఎండీ ) ఆధ్వర్యంలో సుమారు 250 మంది తలసేమియా బాధిత పిల్లలకు ప్రతినిత్యం ఆసుపత్రిలో ఉచితంగా రక్తం ఎక్కించే ప్రక్రియను నిరాటంకంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ... "శరీరంలో తగినంత రక్తం ఉత్పత్తి కాకుండా జన్మించడమనేది ఆ పిల్లలు చేసిన పాపం కాదు. అది ఒక జన్యుపరమైన సమస్య. రక్తం లేక నరకయాతన అనుభవిస్తున్న ఆ పసిపాపలకు రక్తాన్ని దానంచేసి ప్రాణాలు కాపాడటం అంటే మరో పునర్జన్మ ఇవ్వడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు.తలసేమియా పిల్లలు ఆరోగ్యంగా జీవించాలంటే క్రమం తప్పకుండా రక్తం మార్పిడి అవసరమని, దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.బాధిత కుటుంబాలకు ఈ చికిత్స భారం కాకూడదనే ఉద్దేశంతో రితన్య హాస్పిటల్ ద్వారా నిరంతరం ఈ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.అయితే ప్రాణాపాయంలో ఉన్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం కూడా తక్షణమే స్పందించాలని కోరారు.తలసేమియా పిల్లల కోసం ప్రత్యేకంగా 'బ్లడ్ బ్యాంక్' (రక్త నిధి) ఏర్పాటు చేసి,ఉచితంగా రక్తాన్ని అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, యువత, దాతలు మానవత్వంతో స్పందించి నిరంతరం రక్తదానం చేస్తూ ఈ పసికందుల జీవిత కాంతులను కాపాడాలని రితన్య హాస్పిటల్ యాజమాన్యం కోరుతోంది.

## మంద సత్యానందం
# కుటుంబానికి 20 వేలు ఆర్థికసహాయం

★ అందజేసిన "విజన్ ఆంధ్ర" పత్రిక ఖమ్మం జిల్లా కుటుంబ సభ్యులు

**బోనకల్, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** బోనకల్ మండల "విజన్ ఆంధ్ర"బోనకల్ మండల పత్రికా రిపోర్టర్ గా పనిచేస్తున్న మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన మంద సత్యానందం మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న "విజన్ ఆంధ్ర"పత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా కుటుంబ సభ్యులు వారి స్వగ్రామం గోవిందాపురం చేరుకొని సత్యానందం మృతదేహానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబాన్ని ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వారి సతీమణికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా "విజన్ ఆంధ్ర" పత్రికలో ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని, వారి కుటుంబానికి



ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల బ్యూరోలు రామకృష్ణ, ఉమాకాంత్, వారితోపాటు డి అశోక్ (ముదిగొండ), రవీందర్ (వైరా), ఎస్.కె ముజాఫర్ (బూర్గంపాడు), శ్రీనివాస్ (కొత్తగూడెం), మార్క్ (ఏనుకూరు), వెంకన్న బాబు (భద్రాచలం) లు ఉన్నారు.

# ప్రతీ ఇంటా ఇంకుడుగుంత ఉండాల్సిందే

★ ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టేందుకు చర్యలు

**నేలకొండపల్లి, ఆగస్టు 4 ప్రజాజ్యోతి :** ప్రతీ ఇంటా ఇంకుడు గుంత ఉండాల్సిందేనని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని బుద్దారం, ఆజయ్ తండా, తిరుమలాపురం పంచాయతీ లలో మంగళవారం పర్యటించారు. ఇంకుడు గుంతల పై అవగాహన కల్పించారు. నూతనంగా నిర్మించనున్న గ్రామ సమాఖ్య భవనాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..మండలంలో ప్రతీ నీటి చుక్క ను ఒడిసిపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న కాలం నీటి సమస్య తీవ్రంగా ఉండనున్నట్లు తెలిపారు. ఆ సమస్య ను ఎదుర్కనేందుకు జలసిరి కార్యక్రమం ను . చేపట్టినట్లు తెలిపారు. మండలం లో 2.368 మంది ఐదు ఎకరాల లోపు రైతులు గుర్తించినట్లు తెలిపారు. వీరిలో అర్హత కలిగిన వారికి పంట కుంటలను మంజూరు చేస్తామని చెప్పారు. అదే విధంగా మండల వ్యాప్తంగా 1630 మంది వ్యక్తిగత ఇంకుడు గుంతలు అవసరమని గుర్తించామని





పేర్కొన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలను 109 చోట్ల, డ్రైయినేజీ ముగింపు దగ్గర ఇంకుడు గుంతలకు 44 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో సర్వే పూర్తి చేసిన తరువాత రైతుల నుంచి అంగీకార పత్రాలను తీసుకోవాలని సూచించారు. రానున్న వేసవి ని దృష్టిలో ఉంచుకుని జలసిరి పథకం లో నీటి ని ఒడిసిపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామ సమాఖ్య భవనాలను శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్ లు మేళ్లచెరువు సత్యం, తేజావత్ శివాజీ, కమదన ప్రవీణ్, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, సొసైటీ మాజీ చైర్మన్ ఆరెకట్ల గురవయ్య, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు యం.వెంకటేశ్వర్లు, బైరం దినేష్కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగరాలి: ఆదివాసి సంక్షేమ పరిషత్

★ ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

★ ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా కరపత్రాల ఆవిష్కరణ

**దమ్మపేట, ఆగస్టు 4(ప్రజాజ్యోతి):** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్స వెంకటే శ్వరరావు మాట్లాడుతూ, ప్రతి గూడెంలో ఆదివాసి జెండాను ఎగురవేసి జాతి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, రాజ్యాంగబద్ధమైన చట్టాలను పరిరక్షించేందుకు బలమైన ఉద్యమ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న జిల్లా ప్రధాన కేంద్రం కొత్తగూడెంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీ, బహిరంగ సభకు ప్రతి ఆదివాసి కుటుంబం పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జాతీయ నాయకులు తెల్లం






రామారావు దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకులు కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమంలో
# పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్

**పినపాక,ఆగష్టు 04 (ప్రజాజ్యోతి)** పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలు, రికార్డులు, నివేదికలు, వివిధ వార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్





వంటి సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు.ప్రతి మంగళవారం, శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యాంటీ లార్వల్ చర్యలు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సేవలు అందించేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం డీఎంహెచ్ఓ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్, వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాంప్రసాద్, హనుమంతు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాపారులందరూ ఒకే ధర విధానం పాటించాలి

**ఇల్లందు, ఆగస్ట్ 4 (ప్రజా జ్యోతి)** నూతన మోడల్ మార్కెట్ లోని వ్యాపారులందరూ ఒకే ధర విధానం పాటించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో కూరగాయల వ్యాపారస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన మార్కెట్ లో చిరువ్యాపారులు ఇబ్బందులు పడవద్దన్నారు. వ్యాపారస్తులందరూ సామూహిక నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం






రూ. కోట్లతో చిరు వ్యాపారుల కోసం నూతన నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కొద్ది రోజులలో మార్కెట్ చుట్టూ షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, అప్పటివరకు చిరు వ్యాపారులు ఐకమత్యంతో వ్యాపారాలు కొనసాగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కమిషనర్ సందీప్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బొళ్ళ సూర్యం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, వ్యాపారస్తులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా తనగాల తిరుపతిరావు

★ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు

**దమ్మపేట, ఆగస్టు 4(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ దమ్మపేట మండల అధ్యక్షుడిగా నియమితులైన తనగాల తిరుపతిరావు నియామక ఉత్తర్వులను జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈ నియామకం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



ఆశీస్సులతో పాటు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆశీర్వాదంతో జరిగినట్లు తెలిపారు.ఈ సందర్భంగా తనగాల తిరుపతిరావు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## లేబర్ కోడ్ల రద్దుతోనే
# కార్మిక హక్కులకు రక్షణ


★ ఆశ వర్కర్స్ యూనియన్

★ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం నిర్వహించి, ఈ నెల 10న చేపట్టనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షురాలు కాక విజయ మాట్లాడుతూ, కార్మికులు దీర్ఘకాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల ద్వారా బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఆశ వర్కర్లను స్కీమ్ వర్కర్లుగా కాకుండా పూర్తి స్థాయి కార్మికులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని అమల్లోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను ఉపసంహరించి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. సమావేశం అనంతరం ఆశ వర్కర్ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ నజ్ నిన్ తబసుమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ముంతాజ్, సీత, ప్రియాంక, వెంకటలక్ష్మి, నాగమణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఐటీలో సీటు సాధించిన ఆదివాసి
# విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం



**పినపాక,ఆగష్టు 04(ప్రజాజ్యోతి)** పినపాక మండలం జానంపేట సమీపంలోని అమరవరం గ్రామానికి చెందిన ఆదివాసి విద్యార్థి పూనెం రాకేష్‌కు ఆదివాసి విద్యానేస్తం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.శంకరయ్య--కమల దంపతుల కుమారుడైన రాకేష్, ప్రతిష్టాత్మకమైన జార్ఖండ్‌లోని ఎన్ఐటి జంషెడ్‌పూర్లో ఎం.ఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో ప్రవేశం పొందడం సందర్భంగా ఈ సహాయం అందించారు. విద్యార్థి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యకు చేయూతగా ఈ మొత్తాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దనసరి నరసింహమూర్తి (అడ్వకేట్), కొమరం శ్రీను, బిజ్జా అనిల్, సుతారి కృష్ణసాగర్, వజ్జ రమేష్ ఆర్థిక సహకారం అందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ప్రతిభావంతులైన ఆదివాసి విద్యార్థుల ఉన్నత విద్యకు సమాజం మరింతగా అండగా నిలవాలని ఆదివాసి విద్యానేస్తం ప్రతినిధులు కోరారు. విద్యకు అందించిన ప్రతి చేయూత సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన
## పాత్రికేయుడు మంద సత్యానందంకు
# ముదిగొండ ప్రజాజ్యోతి నివాళి

శ్రద్ధాంజలి ఘటించిన ప్రజాజ్యోతి రిపోర్టర్ నారాపొంగు సైదులు

**ముదిగొండ ఆగస్టు 4(ప్రజా జ్యోతి)**దబోనకల్లు మండలం గోవిందపురం గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర రిపోర్టర్ మంద సత్యానందం గత రాత్రి రావినూతల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పాత్రికేయల లో తీవ్ర విషాదంలో ముంచింది. మంగళవారం మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం ముదిగొండ ప్రజాజ్యోతి రిపోర్టర్ నారాపొంగు సైదులు ఆసుపత్రికి చేరుకుని మంద సత్యానందం భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంద సత్యానందం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# మత్స్యకారుల సంక్షేమానికి రూ.116 కోట్ల విడుదల

కరీంనగర్ టౌన్ ఆగస్టు 4 (ప్రజా జ్యోతి ): తెలంగాణ రాష్ట్ర ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న బీసీ బిడ్డ, మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి, మత్స్యకార కుటుంబాల అభ్యున్నతినే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా తీసుకుని రూ.116 కోట్లను మత్స్యకారుల సంక్షేమం కోసం విడుదల చేయించడం పట్ల రాష్ట్రంలోని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి , మంత్రి డా. వాకాటి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు కృతజ్ఞతలు తెలియజేసినారు వారిలో మాల కనకయ్య ముదిరాజ్ తెలంగాణ ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అనంతరం కరీంనగర్ లోని గీత భవన్ చౌరస్తానందు, రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి , డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాల కనకయ్య ముదిరాజ్ తెలంగాణ ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీధర్ ముదిరాజ్ శిల్లా పరశురాములు ముదిరాజ్ మల్లేశం ముదిరాజ్ అయితర వేణి కొమురయ్య ముదిరాజ్ రాజ్ ముదిరాజ్ యామరాజు ముదిరాజ్ శ్రావణ్ ముదిరాజ్ గుండ మల్లేశం ముదిరాజ్ భూత గడ్డ వెంకటి ముదిరాజ్ గుండా వెంకటి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 26వ వార్డ్ లో తల్లిపాల వారోత్సవాలు పాల్గొన్న, కౌన్సిలర్ మామిండ్ల. అమర్ష

వేములవాడ,ఆగస్టు,4:ప్రజాజ్యోతి: వేములవాడ పట్టణం లోని 26వ వార్డు లోనిఅంగన్వాడీ స్కూల్ నందు మంగళవారం రోజునతల్లిపాలవారోత్సవాల్లో భాగంగా అంగన్వాడి స్కూల్లో కౌన్సిలర్ మామిండ్ల. అమర్ష మాట్లాడుచూ తల్లి పాలు పిల్ల లకు అత్యంత శ్రేయస్కరమని, బాలింతలు తమ ఆరోగ్యం కాపాడుకొంటూ,పౌష్టికఆహారం తీచుకొంటూ, నవజాత శిశువు నుండి 5సంవత్సరాలువయసు వచ్చేవరకుజాగ్రత్తలుపాటించాలి అన్నారు తల్లి పాలు పిల్లల ఆరోగ్యంకుఅత్యంతశ్రేయస్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు మహిళలు అంగన్వాడి టీచర్, వార్డ్ లోని, గర్భిణీ స్త్రీలు, పిల్ల తల్లులు,పాల్గొనడం జరిగింది.

## నల్ల కాగితాలతో 500 నోట్లు అంటూ బురిడీ

కోటి కోసం 13 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): రూ.కోటి వస్తుందని నమ్మి రూ.13 లక్షలు పోగొట్టుకున్న సంఘటనలో నిందితుణ్ని అరెస్టు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అశ్వారావుపేట ఠాణాలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. ఏపీలోని ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన పత్తిపాటి ప్రేమ్‌చంద్ కొన్నాళ్ల కిందట అశ్వారావుపేట వచ్చి ఫైర్ కాలనీలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి మోసపూరితంగా సంపాదించే మార్గాలను ఎంచుకున్నాడు. అశ్వారావుపేటకు చెందిన వ్యాపారి మధుబాబును గత ఏడాది డిసెంబరులో కలిసి తనకు రూ.15 లక్షలు ఇస్తే రూ.కోటి ఇస్తానని మాయమాటలు చెప్పాడు. నోట్లను క్షణాల్లో తయారు చేస్తానని నమ్మించి రసాయనాలు కలిపిన నీళ్లలో నల్లని కాగితాలను ముంచి అప్పటికే చేతి వేళ్ల మధ్య అసలు నగదు నోట్లు దాచి ఉంచిన అసలు రూ.500 నోట్లుగా మారినట్లు నమ్మించాడు. కొద్దిరోజుల్లోనే నల్లని కాగితాలను నోట్లుగా తయారు చేసి రూ.కోటి ఇస్తానని చెప్పాడు. దీనికి రూ.15 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇది నమ్మిన మధుబాబు నిందితుడికి తొలి విడతగా రూ.11 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత రసాయనాలు కొనుగోలు చేయాలని చెప్పడంతో మరో రూ.2 లక్షలు ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా ఇస్తానన్న రూ.కోటి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ÷ర్ కాలనీలో నిందితుడు ప్రేమ్‌చంద్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.500 నోట్ల పరిమాణంలో కత్తిరించిన 20,000 నల్లటి కాగితాలు 20 కట్టలు, రెండు రసాయనాల సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## టీ కోసం వెళ్లొచ్చే సరికి ఇంట్లో దొంగతనం

నిజామాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి అనంతరం తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని అర్ధరాత్రి సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మూడో టౌన్ ఎస్ఐ హరిబాబు కథనం ప్రకారం.. నిజాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన సాయి అనే వ్యక్తి సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి రైల్వే స్టేషన్ వద్ద టీ తాగేందుకు వెళ్లాడు. తిరిగి గంట తర్వాత ఒకటింటికి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరంగా ఉండడంతో రెండు గంటల సమయంలో తనకు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మూడు తులాల బంగారం దొంగతనం జరిగినట్లు బాధితుడు వెల్లడించాడు. ఘటనా స్థలాన్ని నగర సీఐ శ్రీనివాస్ రాజ్ పరిశీలించి క్లూస్ టీం తో ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఐ హరిబాబు వెల్లడించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తారా

సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి అర్వింద్ ఆగ్రహం

న్యూఢిల్లీ,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు





మొదటిపేజీ తరువాయి..

ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు హరీశ్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేశారంటూ చేసిన వ్యాఖ్యలపై లీగల్ నోటీసులు పంపారు. వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే పరువునష్టం దావా వేస్తామని నోటీసులు జారీ చేశారు.

## నగరంలో పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

మొదటిపేజీ తరువాయి..

సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ –ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు.

13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు.

25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ



ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు.

రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ– ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# తమిళనాట రాజకీయ రచ్చ.. త్రిషపై పరోక్ష విమర్శలు

ఉదయనిధి అరెస్ట్.. కోర్టు ఆదేశాలతో విడుదల

చెన్నై,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): తమిళనాడులో సీఎం విజయ్, సినీ



నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో అరెస్టయిన ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు విడుదల చేశారు. పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సుమారు గంటన్నరపాటు విచారించిన అనంతరం విడుదల చేశారు.

కావేరి జలాల అంశంపై జరిగిన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను చెన్నైలోని నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను సవాల్ చేస్తూ డీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం ఉదయనిధిని విడుదల చేయాలని, తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. కావేరీ జలాల అంశం ప్రస్తుతం తమిళనాడులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో తంజావూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉదయనిధిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కావేరీ నదీ జలాల అంశంపై సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డెల్టా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉదయనిధి పరోక్షంగా నటి ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



'ఇవి అసహ్యమైన వ్యాఖ్యలు. ఎవరిపైనా ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. డీఎంకే దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలకు ఈ మాటలు నిదర్శనం' అని టీవీకే నేతలు మండిపడ్డారు. భాజపా నేతలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. ఇది సిగ్గుచేటు ప్రవర్తన అని తప్పుపట్టారు. ఉదయనిధి తీరుపై టీవీకే పార్టీ.. జాతీయ మహిళా కమిషన్‌ను ఫిర్యాదు చేసింది. ఆయన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని, చర్యలు చేపట్టాలని కోరింది. అలాగే ఉదయనిధి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

## నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత..

హైదరాబాద్,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): ఇండస్ట్రీలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూశారు. కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 74 ఏళ్ల రావత్, ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. జనవరి 21, 1952న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించిన ప్రదీప్ రావత్ తెలుగులో ఎన్నో సినిమాల్లో నటించారు. ముఖ్యంగా 'సై' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రావత్.. బిక్షూ యాదవ్ పాత్రతో మరింత ఫేమస్ అయ్యారు. ఈ సినిమాకు ఉత్తమ ప్రతినాయకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. అలాగే ప్రభాస్ నటించిన ఛత్రపతి సినిమాలో రాజ్ బిహారిగా అదిరిపోయే విలనిజంతో మెప్పించారు. ఇక తెలుగులో భద్ర, దేశముదురు, స్టాలిన్, నేను శైలజ, ఓయ్ సినిమాలతో స్టార్ ఇమేజ్ సంపాదించుకున్నారు. తెలుగులో చివరగా 'గాయపడ్డ సింహం'లో నటించారు. తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో కేవలం హిందీకే పరిమితం కాకుండా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, భోజ్‌పురి, నేపాలీ ఇలా పలు భాషల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించి బహుభాషా నటుడిగా గుర్తింపు సంపాదించుకున్నారు.తెలుగులో ఎన్నో చిత్రాల్లో మెప్పించిన ప్రదీప్ రావత్.. 2004లో దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'సై' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. తొలి సినిమాలోనే 'బిక్షూ యాదవ్' పాత్రలో ఆయన పూర్తిగా ఒదిగిపోయిన తీరు తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ అద్భుతమైన నటనకు గాను ఆయనకు ఉత్తమ ప్రతినాయకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు దక్కింది. ఆ తర్వాత వచ్చిన 'గజిని' సినిమాలో ప్రదీప్ రావత్ చేసిన మెయిన్ విలన్ క్యారెక్టర్ అప్పట్లో ఓ సంచలనం సృష్టించింది. ఆ సినిమాతో ఆయన ఇమేజ్ అమాంతం పెరిగిపోయి మోస్ట్ వాంటెడ్ విలన్‌గా మారిపోయారు. 'సై' తర్వాత తెలుగులో ప్రభాస్ నటించిన 'ఛత్రపతి' సినిమాలో 'రాజ్ బిహారి'గా మరోసారి అదిరిపోయే విలనిజం



పండించారు. ఆ తర్వాత 'భద్ర', 'దేశముదురు', 'స్టాలిన్', 'నేను శైలజ', 'ఓయ్'.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించి విలన్‌గా స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. క్రూరమైన ప్రతినాయకుడి పాత్రలే కాకుండా కొన్ని క్యారెక్టర్ రోల్స్ కూడా చేసి తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. నేను శైలజలో ఆయన చేసిన కామెడీ కడుపుబ్బా నవ్వించింది. కాగా తెలుగులో ఆయన చివరగా తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన 'గాయపడ్డ సింహం' సినిమాలో నటించారు. తన గంభీరమైన నటనతో దశాబ్దాల పాటు సినీ అభిమానులను అలరించిన ప్రదీప్ రావత్ మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు.

## అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా?

మొదటిపేజీ తరువాయి..

రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు




చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్–2, మణుగూరు బ్లాక్‌లను.. సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## సిఎం విజయ్ ఓ అసమర్థ నాయకుడు

కావేరీ జలాలపై దృష్టి మరల్చేందుకే ఉదయనిధి అరెస్ట్ ఎక్స్ వేదికగా మండిపడ్డ మాజీ సిఎం స్టాలిన్

చెన్నై,ఆగస్ట్4(ప్రజాజ్యోతి): నటి త్రిషను ఉద్దేశిస్తూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తమిళనాట రాజకీయ దుమారం రేపాయి. ఇందుకు సంబంధించిన కేసులో ఆయన అరెస్టయి.. బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ పరిణామాలపై ఉదయనిధి తండ్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. సీఎం విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అహంకారం వినాశనానికి దారితీస్తుందని, అది నిరంతరం కొనసాగితే.. మరింత వేగంగా పతనమవుతారని దుయ్యబట్టారు. విజయ్.. ఓ అసమర్థ నాయకుడని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

'కావేరీ నదీ జలాలు, మేకెదాటు ప్రాజెక్ట్ వ్యవహారంలో తమిళనాడు హక్కులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దాన్ని ఖండించేందుకు తంజావూరులో డీఎంకే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. అందులో ఉదయనిధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ విమర్శలకు బదులుచెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని లేదు. అందుకే వాటిపై దృష్టి మరల్చేందుకు ఉదయనిధిని అరెస్ట్ చేసింది. మన సీఎం విజయ్ కావేరీ నీటిని తీసుకురాలేరు. ఆయనో డమ్మీ సీఎం. ఇక, ఆయన మంత్రులు ఒక సినిమా (జననాయగన్‌ను ఉద్దేశిస్తూ)ను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రంలో ఓ జోకర్ క్యాబినెట్ అధికారంలో ఉందని స్టాలిన్ విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఉదయనిధి పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. ఇంటికొచ్చి అరెస్టు చేసి.. తంజావూరుకు తీసుకెళ్లారు. కోర్టు విచారణ సందర్భంగా ఉదయనిధిని కస్టడీలోకి తీసుకొనే ఉద్దేశం లేదని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. మరి అలాంటప్పుడు ఆయనను తంజావూరుకు ఎందుకు తరలించారు? ఎందుకు అన్ని కేసులు పెట్టారు. కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టని మాజీ సీఎం ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. తనను విమర్శిస్తున్న వారందరినీ విజయ్ అరెస్టు చేయిస్తున్నారని స్టాలిన్ దుయ్యబట్టారు. చెన్నైలోని మెరీనా బీచ్ వద్దకు ఆందోళనకారులను రానివ్వడం లేదని, నీట్ వ్యతిరేక ర్యాలీని కూడా అనుమతించట్లేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఉదయనిధి అరెస్టు కుట్రపూరిత చర్యేనని స్టాలిన్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు తమ నేతను దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే ఉదయనిధిపై తప్పుడు కేసులు పెట్టించారని విమర్శించారు. తన కుమారుడు ఎవరిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ అలా చేసినట్లు నిరూపిస్తే తక్షణమే క్షమాపణలు చెబుతాడని స్టాలిన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సీఎం విజయ్ ఇకనైనా రీల్స్ క్రియేట్ చేయడం మాని.. తన బాధ్యతలను గుర్తించి దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967